

- జలాశయాల్లోకి నీరొచ్చిందని సంతోషం
- సాగునీటి కాలువల్లో పూడికతీయలేదని వేదన
- సోమశిలలో 50 టీఎంసీల నీరు
- పూర్తి ఆయకట్టులో సాగుకు అవకాశం
- ఓఅండ్ఎం పనులకు రాని అనుమతులు
- సీజన్ సమీపిస్తుండడంతో రైతుల ఆందోళన

# ఇటు ఆనందం.. అటు ఆవేదన !

**నెల్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):** రానున్న సీజన్‌కు సరిపడా నీరు శ్రీశైలం నుంచి సోమశిలకు చేరింది. దీంతో ఓ వైపు రైతుల ముఖాల్లో సంతోషం కనిపిస్తోంది. అదే సమయంలో మరోవైపు కాలువల్లో పూడికతీతకు ఇంకా అనుమతులు రాకపోవడంతో ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. సోమశిలలో నీటి నిల్వ 50 టీఎంసీలకు చేరింది. దీంతో రానున్న సీజన్‌లో పూర్తి ఆయకట్టు 5.50 లక్షల ఎకరాల్లో సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. అయితే ఓఅండ్ఎం పనులకు ఇంత వరకు అనుమతులు రాలేదు. అవి వస్తే కానీ కాలువలను బాగుచేయడం సాధ్యపడదు. అక్టోబరు నుంచి కాలువలకు నీరు విడుదల చేయాల్సి ఉంటుంది.

**● రైతులపై కక్షకట్టిన వైసీపీ ప్రభుత్వం**

రైతులపై కక్షగట్టినట్లుగా వైసీపీ ప్రభుత్వం వ్యవహరించింది. కనీసం కాలువలను కూడా పట్టించుకోకపోవడంతో పూడిక, గుర్రపు డెక్కతో నిండిపోయాయి. గత రెండేళ్లుగా ఓఅండ్ఎం పనులు చేయకుండానే చేసినట్లుగా బిల్లులు చేసుకున్నారు. ఈ ప్రభావం సాగుపై పడింది. కాలువల్లో స్థాయికి తగ్గట్లు నీటి పారుదల జరగకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరందలేదు. ఏటా సీజన్ మొదలై కాలువల్లో నీరు పారుతున్న సమయంలో ఓఅండ్ఎం అనుమతులు ఇవ్వడం, ఆ తర్వాత పనులు చేయకుండానే చేసినట్లు బిల్లులు రికార్డు చేయడం రివాజుగా మారింది. ఈ క్రమంలో ప్రభుత్వం మారడంతో ఈ దఫానైనా కాలువలను బాగు చేయా లని రైతులు కోరుతున్నారు. కానీ సీజన్ దగ్గర పడుతున్నా ఇంత వరకూ ఓఅండ్ ఎం పనులకు అనుమతులు రాకపోవడం రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. వచ్చే నెల నుంచి సీజన్ మొదలవుతుంటే ఇక అప్రూవల్స్ ఎప్పుడు ఇస్తారు..? టెండర్లు ఎప్పుడు పిలుస్తారు ? పనులు ఎప్పుడు పూర్తి చేస్తారు..? అంటూ రైతులు మథనడపతున్నారు.

**● ప్రతిపాదనలకు మోక్షమేది ?**

జిల్లా నుంచి ప్రతిపాదనలు వెళ్లి దాదాపు రెండు నెలలు కావస్తోంది. కానీ ఇంతవరకు ఫైనాన్స్ అప్రూవల్ రాలేదు. ప్రస్తుతం ఉన్న స్థితిలో కాలువ లను పూర్తిస్థాయిలో బాగు చేయా లంటే సుమారు రూ.110 కోట్లు అవసరమని జిల్లా నుంచి ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రతిపాదించారు. సాధారణంగా ఏటా ఓఅండ్ ఎం పనులకు రూ.30 కోట్లలోపే సరిపోతాయి. కానీ రూ.110 కోట్లు ప్రతిపాదించారంటే వైసీపీ ప్రభుత్వంలో ఏ స్థాయిలో కాలువలను నాశనం చేశారో అర్థం చేసుకోవచ్చు. అయితే శిస్తు వసూలు జరగకుండా అంత పెద్ద మొత్తం ఓఅండ్ఎం కింద ఇవ్వడం సాధ్యపడదని నిర్ధారించిన రాష్ట్ర ఉన్నతాధికారులు ఈ సీజన్‌కు రూ.40 కోట్లతో ఓఅండ్ఎం ప్రతిపాదనలు పంపా లని, ఆ నిధులతో అత్యవసర పనులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో ఆ మేరకు అన్ని డివిజన్ల నుంచి ప్రభుత్వానికి ప్రతిపా దనలు అందాయి. అక్టోబరు నుంచి వ్యవసా య పనులు ప్రారంభం కానున్నాయి. రైతులు దుక్కులు దున్నడం మొదలు పెడతారు. దీంతో కాలువలు, చెరువులకు నీరు విడుదల చేయాల్సి ఉంటుంది. అప్పుడు పూడికతీత పనులు చేయడం కష్టమవుతుంది. ఈ లోపు పనులు పూర్తి చేస్తేనే చివరి ఆయకట్టు రైతాంగానికి ఇబ్బందులు లేకుండా ఉంటాయి.

**● సాగుకు ఢోకా లేదు**

రానున్న సీజన్‌పై రైతులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం మారడం, ప్రకృతి సహకరించడంతో ఈ దఫా సాగుకు అవసరమైన నీరు ప్రాజెక్టుల్లోకి చేరింది. గతేడాది ఖరీఫ్‌లో సగం ఆయకట్టు కూడా సాగు కాలేదు. ఈ ఏడాది రబీలో అయితే అసలు పంటే వేయలేదు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టులు ఖాళీ అయ్యాయి. ధాన్యం ధరలు ఆశాజనకంగా ఉన్నా సాగు లేకపోవడం రైతాంగాన్ని కుంగదీసింది. ధర ఉన్నప్పుడు కూడా పంట వేసుకోలేని దుస్థితి నెలకొంది. సోమశిల, కండలేరు జలాశయాలు డెడ్ స్టోరేజీకు చేరుకోవడంతో ఈ ఏడాది అసలు సాగు జరుగుతుందా..? అన్న అనుమానాలు రైతుల్లో ఉండేవి. కానీ కృష్ణా బేసిన్‌లో భారీ వరదలు రావడం, శ్రీశైలం జలాశయం నిండిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో ఆలోచించింది. పోతిరెడ్డిపాడు నుంచి కృష్ణా జలాలను సోమశిలకు తీసుకొస్తోంది. అక్కడి నుంచి కండలేరుకు తరలిస్తున్నారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి కృష్ణా జలాల రాక ప్రారంభం కాగా, ఇప్పటి వరకు దాదాపు 50 టీఎంసీల వరకు జిల్లాకు చేరాయి. ప్రస్తుతం సోమశిల నీటి మట్టం 50 టీఎంసీలకు చేరువ కాగా, కండలేరు కూడా 12 టీఎంసీలకు చేరింది. ఇంకా జలాల రాక కొనసాగుతూనే ఉంది. ఇప్పటికున్న నీటితో మొదటి పంట పూర్తి ఆయకట్టులో సాగు చేయవచ్చు. సోమశిల, కండలేరు జలాశయాల కింద పూర్తి ఆయకట్టు 5.50 లక్షల సాగుకు అవకాశం కలగడంతో రైతుల ముఖాల్లో సంతోషం కనిపిస్తోంది. అక్టోబరు, నవంబరు నెలల్లో పెన్నా క్యాచ్‌మెంట్లో స్వల్పంగా వర్షాలు కురిసినా ఆ నీరు వచ్చే ఏడాది రెండో పంటకు ఉపయోగపడుతుంది. దీంతో రానున్న రెండు సీజన్లు రైతులకు దిగులు లేకుండా పోయింది. అయితే సాగులో కీలకమైన పంట కాలువలను బాగు చేయడం మాత్రం అత్యవసరం.

**ఇంకా అనుమతులు రాలేదు**

ఓఅండ్ఎం పనులకు ప్రతిపాదనలు పంపాం. ఇంకా అనుమతులు రాలేదు. ఇటీవల కూడా అధికారులు వివరాలు తీసుకున్నారు. మరోవారంలో అనుమతులు వస్తాయని ఆశిస్తున్నాం. అనుమతులు రాగానే టెండర్లు పిలిచి, కాలువల్లో పూడిక తీయిస్తాం.

- నాగరాజు, ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ ఈఈ



నీరుపారే అవకాశం లేకుండా పూడిక, గుర్రపు డెక్కతో నిండిన అల్లూరులోని పంట కాలువ

# జామాయిల్‌కు రికార్డు ధర

- టన్ను రూ. 7 వేలు ● డిమాండ్‌కు తగ్గట్టుగా లేని సరుకు
- మరింత రేటు పెంచేందుకు పరిశ్రమలు సిద్ధం ● లక్షల ఎకరాల్లో ముమ్మరంగా సాగు

**కందుకూరు, సెప్టెంబరు 15:** రెండేళ్లక్రితం వరకు మాకు గిట్టుబాటు ధర కల్పించండి మహాప్రభో.. అంటూ పాలకులను వేడుకున్న జామాయిల్ రైతు నేడు ఆనందంతో సరుకు అమ్ముకుంటున్నారు. ఐదు దశాబ్దాల చరిత్రలో ఎన్నడూ లేనంతగా జామాయిల్ కర్రకు నేడు రికార్డు ధర లభించింది. రెండేళ్లక్రితం వరకు టన్ను రూ. 3వేలకు కూడా కొనేస్థితి లేదు. అయితే నేడు టన్ను రూ. 7వేలకు అమ్ముకుంటున్నారు. అంత ధర చెల్లించినా డిమాండ్‌కు తగ్గట్టుగా జామాయిల్ కర్ర లభ్యత లేదు.

**● మరింత పెంపు దిశగా..**

పేపరు పరిశ్రమలు, ఫ్లైవుడ్ పరిశ్రమల వారు మరింతగా ధరను పెంచేందుకు కూడా సిద్ధపడుతున్నట్లు తెలిసింది. దీంతో రానున్న రోజుల్లో టన్నుకు మరో రూ. 500 నుంచి రూ. 1000 వరకు ధర పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. గత పదేళ్లలో జామాయిల్ సాగుతో నష్టాలపాలై విసిగి వేసారిన రైతులు , గత మూడేళ్లుగా సాగునుంచి తప్పుకుని, ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఉపక్రమించారు. దీంతో ప్రస్తుతం సరుకు లేని పరిస్థితులు ఏర్పడ్డాయి.

**● ఫ్లైవుడ్ పరిశ్రమలవల్లే గిరాకీ**

రాష్ట్రంతోపాటు చుట్టుపక్కల రాష్ట్రాల్లో మూతపడి ఉన్న పలు పేపరు పరిశ్రమలు తిరిగి ప్రారంభించారు. దీంతోపాటు ఫ్లైవుడ్ పరిశ్రమలు బాగా విస్తరిస్తుండడంతో జామాయిల్‌కు డిమాండ్ పెరిగిందని వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. రాజమండ్రిలో ఉన్న ఏపీ పేపరు మిల్లుతో పాటు భద్రాచలం వద్ద ఉన్న ఐటీసీ పేపరు మిల్లులో ఉత్పాదన పెంచటం, ఎంతోకాలంగా మూతపడి ఉన్న తెలంగాణలోని సిర్పూర్ కాగజ్‌నగర్ పేపరు పరిశ్రమ తిరిగి కార్యకలాపాలు ప్రారంభించటం, కర్నాటక, మహారాష్ట్రలోనూ మూతపడి ఉన్న పేపరు మిల్లులు తెరుచుకోవటం ఇందుకు ఒక కారణమైతే, ప్రధాన కారణం ఫ్లైవుడ్ పరిశ్రమలు పెరగడమని వారు భావిస్తున్నారు. గృహ నిర్మాణంలో నేడు కలప స్థానంలో ఫ్లైవుడ్ వినియోగం విపరీతంగా పెరిగింది. దీనితోపాటు ఇంటీరియల్ డెకరేషన్, కార్పోరేట్ ఆఫీసుల పార్టీషియన్, ఇంటీరియల్స్‌లో ఫ్లైవుడ్ ప్రధాన భూమిక పోషిస్తున్నది. దీంతో ఈ పరిశ్రమలు విస్తారంగా పెరిగాయి. కందుకూరు సమీపంలోని కోవూరు వద్ద ఓ భారీ ఫ్లైవుడ్ పరిశ్రమ గత తొమ్మిదేళ్లుగా ఉత్పత్తి చేస్తుండగా, ప్రకాశం జిల్లా మండల కేంద్రమైన మర్రిపూడి సమీపంలోనూ మరో ఫ్లైవుడ్ పరిశ్రమ రెండేళ్ల నుంచి ఉత్పత్తిని ప్రారంభించింది. శ్రీకాళహస్తి వద్ద మరో భారీ ఫ్లైవుడ్ పరిశ్రమ ఉండగా, బద్వేలు సమీపంలో సెంచరీ కంపెనీ అతిపెద్ద ఫ్లైవుడ్ పరిశ్రమను నెలకొల్పింది. త్వరలోనే మరికొన్ని ఫ్లైవుడ్ పరిశ్రమలు కూడా ఏర్పాటయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫ్లైవుడ్ తయారీకి ప్రధాన ముడిసరుకు జామాయిల్ కాగా, ప్రస్తుతం జామాయిల్ లభ్యత లేక మామిడి, సపోటా, చిల్ల, తుమ్మ లాంటి కర్రను కూడా ఫ్లైవుడ్ పరిశ్రమలో వాడు తున్నారు. అయితే జామాయిల్ ప్రధాన వినియోగం కావటంతో ధర నానాటికీ పెరుగుతోంది.



ఎగుమతికి సిద్ధంగా ఉన్న జామాయిల్ కర్ర

**● ముమ్మరంగా సాగు**

ఎకరా విస్తీర్ణంలో జామాయిల్ కర్ర అమ్మితే రూ.2 నుంచి రూ. 3 లక్షల వరకు రాబడి వస్తున్నది. దీంతో ప్రస్తుతం రైతులు విస్తారంగా జామాయిల్ సాగు చేస్తున్నారు. గత ఏడాది కందుకూరు డివిజన్‌లో వేలాది ఎకరాలలో జామాయిల్ సాగు జరగ్గా ఈ ఏడాది విస్తారంగా జామాయిల్ నాట్లు వేస్తున్నారు. కందుకూరు డివిజన్‌లో ప్రతిరోజు కనీసం వెయ్యి ఎకరాలకుపైగా విస్తీర్ణంలో నాట్లు పడుతు న్నట్లు అంచనా. కేవలం కందుకూరు డివిజన్‌లోనేకాక ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో వర్షాధార పంటల సాగు చేసే ప్రాంతాలలో ఇవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. నీటి లభ్యత గ్యారంటీ లేని మాగాణి భూముల్లోనూ విస్తారంగా జామాయిల్ నాట్లు వేస్తున్నారు. దీంతో జామాయిల్ నారుకు ఒక్కసారిగా గిరాకీ పెరిగిపోయింది. నెలరోజులక్రితం వరకు మొక్క రూ. 3కు లభించిన క్లోనింగ్ జామాయిల్, నేడు ఐదున్నర, ఆరు రూపాయల పలుకు తోంది. అయినా వెనుకాడ కుండా రైతులు జామాయిల్ సాగు చేసేం దుకు పోటీ పడు తున్నారు.



నెల్లూరు కోటమిట్ట అమీనియా మసీద్‌కు విద్యుత్ దీపాలంకరణ

# నేడు మిలాద్ ఉన్ నబి

- నెల్లూరులో భారీ ప్రదర్శన


**నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 15:** అల్లాహ్ చివరిదూత మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భం గా ముస్లింలు ఈద్ మిలాద్ ఉన్ నబిని భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ పం డుగ ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నందు న సోమవారం ప్రభుత్వం సెలవు ప్రకటిం చింది. ఇస్లామిక్ క్యాలెండర్‌లో మూడవ నెల రబి అల్ అవ్వల్ సందర్భంగా ప్రతి ఏటా ఈ రోజున పండుగను భక్తి,విశ్వాసాలతో జరుపు కుం టారు. సెప్టెంబరు 15 (ఆదివారం) సాయం త్రం నుంచి 16 (సోమవారం) సాయంత్రం వరకు నెల వంక దర్శనం ఉంటుంది. ఈ పండుగ సందర్భంగా పలువురు ముస్లింలు నూతన వస్త్రాలు ధరిస్తారు. పం డుగ విందులతోపాటు మసీదులు, ఇతర దర్శనీయస్థలా లను సందర్శించి ప్రార్థనలు చేస్తారు. ఈ సందర్భంగా మహ్మద్ ప్రవక్తకు కృతజ్ఞతలు తెలిపేందుకు ముస్లింలు సామూహికంగా ప్రార్థనలు చేస్తారు. అల్లాహ్ జీవితంపై, ఆయన చెప్పిన ధర్మాలపై సత్సంగాలు నిర్వహిస్తారు. రాత్రిపూట ఖురాన్‌ను పఠనం చేస్తారు. జిల్లా వ్యాప్తంగా ముస్లింలు ర్యాలీలు నిర్వహించనున్నారు. ఇస్లాం జెండాల(ఆకుపచ్చ జెండా)తో ఈ ర్యాలీ (జులూస్) నిర్వహిస్తారు. నెల్లూరు నగరంలో మిలాద్ ఉన్ నబి సందర్భంగా సోమవారం సాయంత్రం ర్యాలీ నిర్వహించనున్నారు. ప్రధాన ర్యాలీ కోటమిట్ట నుంచి బయలు దేరుతుంది. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.

# 'రివర్స్' రద్దు

- టెండరింగ్ విధానంపై ప్రభుత్వం కీలక నిర్ణయం
- పాత పద్ధతిలోనే టెండర్లు పిలిచేలా ఉత్తర్వులు
- వివాదాస్పద పద్ధతికి చెల్లుచీటి

**నెల్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):** అభివృద్ధి పనుల్లో ప్రధాన ఘట్టమైన టెండరింగ్ విధానంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రివర్స్ టెండరింగ్ విధానాన్ని తాజాగా రద్దు చేసింది. ఇకపై పాత పద్ధతి(2019కు ముందు ఉన్న విధానం)లోనే టెండర్లు పూర్తి చేయాలని జలవనరుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంపై కాంట్రాక్టర్ల వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. రివర్స్ టెండరింగ్ విధానం మూలంగా పనులు చేయాలంటే రాజకీయ నాయకుల సిఫార్సు సంపాదించుకోవాల్సి వచ్చేదని, ఇకపై స్వేచ్ఛగా టెండర్లు వేసుకోవచ్చునని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చాక రివర్స్ టెండరింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. అంతకుముందు సాఫీగా జరుగుతున్న టెండర్ల ప్రక్రియను వివాదాస్పదం చేసింది. టెండరింగ్ ప్రక్రియ అంటేనే గోప్యంగా జరగాల్సి ఉండగా, దాన్ని బహిర్గతం చేసింది. రివర్స్ టెండరింగ్ విధానం మూలంగా ఏయే కాంట్రాక్టర్ టెండర్లు వేస్తున్నారన్నది తెలిసిపోయేది. ఏ కాంట్రాక్టర్ ఎంతకు కోట్ చేశారన్న విషయాన్ని ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నేతలు వెంటనే తెలుసుకునేవారు. ఆ తర్వాత బేరసారాలు మాట్లాడడమో లేక తన అనుమాయులకు వర్కును కట్టబెట్టేందుకు ఇతర కాంట్రాక్టర్లు రివర్స్ టెండర్లో పాల్గొనకుండా చేయడమో చేసేవారు. ఇలా కాంట్రాక్టర్లందరినీ బెదిరిస్తూ వర్కులు లాక్కొనేవారు. నిబంధనల ప్రకారం టెక్నికల్ బిడ్ ఓపెన్ చేసిన తర్వాత వారంలోపు రివర్స్ టెండరింగ్ నిర్వహించాలి. కానీ అలా జరిగేది కాదు. కాంట్రాక్టర్లందరినీ రింగ్ చేయడమో లేక ఒత్తిడి చేయడమో జరిగాకనే రివర్స్ టెండరింగ్ నిర్వహించే వారు. ఎవరైనా వీరిని లెక్క చేయకుండా రివర్స్ టెండరింగ్‌లో పాల్గొనేందుకు బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చేందుకు కార్యాలయాలకు వెళితే వారిని దౌర్జన్యంగా అడ్డుకునేవారు. దీని మూలంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడింది. కావలి ప్రధాన రహదారి టెండర్, మలిదేవి డ్రెయిన్ టెండర్, సర్వేపల్లి కాలువ టెండర్, పెన్నా ప్రొటెక్షన్ వాల్స్ టెండర్, చాబోలు రిజర్వాయర్ టెండర్.. ఇలా అనేక రూ.వందల కోట్ల విలువైన వర్కులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియలో వివాదాలు తలెత్తాయి. దీనంతటికీ కారణం.. ఎవరెవరు ఎంత మొత్తానికి టెండర్లు వేశారన్న విషయం బహిర్గతమైపోవడమే.! ఈ రివర్స్ టెండరింగ్ పద్ధతి మూలంగా చాలా మంది కాంట్రాక్టర్లకు పనులు దక్కేవి కావు. తద్వారా టెండర్ల విధానంలో పారదర్శకత లోపించింది. ఈ విధానంలోని లోపాలను, అప్పటి అధికార పార్టీ నేతల దౌర్జన్యాలను 'ఆంధ్రజ్యోతి' అనేక కథనాల ద్వారా వెలుగులోకి తీసుకువచ్చింది. కాగా ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇకపై రివర్స్ టెండరింగ్ ఉండదు. ఒకసారి టెండర్ వేస్తే అదే ఫైనల్ అయిపోతుంది. ఏ కాంట్రాక్టర్ టెండర్ వేస్తున్నారన్నది ఇతరులకు తెలిసే అవకాశం లేదు. కాబట్టి పాదర్శకత ఉంటుందని అధికారులు చెబుతున్నారు.






మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న పీఆర్ ఎస్ఈ అశోక్‌కుమార్, తదితరులు

# 'మోక్షగుండం' సేవలు ఘనం

- ఇంజనీర్స్ డే సందర్భంగా పీఆర్ ఎస్ఈ

**నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 15 :** భార తరత్న, సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి చేసిన సేవలు ఘనమైనవని పీఆర్ సూపరింటెండెంట్ ఇంజనీరు (ఎస్ఈ) అశోక్‌కుమార్ అన్నారు. ఆదివారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతి సందర్భంగా ఇంజనీర్స్‌డేను పురస్కరించుకుని నెల్లూరు పీఆర్ ఎస్ఈ కార్యాలయం ఆవ రణలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణసాగర్ డ్యామ్, తిరుపతి-తిరుమల ఘాట్ రోడ్డు, హైదరాబాద్ వరద ముప్పు నివారణకు మూసీ నదిపై రిజర్వాయర్ నిర్మాణం, మైసూర్ బృందావన్ గార్డెన్స్, బీహార్ వద్ద గంగానదిపై రైలు వంతెన వంటి అద్భుత కట్టడాలను చేపట్టి, భారతదేశ ఇంజనీర్ల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పారన్నారు. మోక్షగుండం ఇంజనీర్లకు మార్గదర్శకుడని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఈఈలు బీ. సుబ్బరాజు, రవీంద్ర బాబు, ఈ. వేణుగోపాల్, పీఆర్ డిప్లమో ఇంజ నీర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్య క్షుడు షేక్ రియాజ్ అహ్మద్, పీఆర్ జేఏసీ చైర్మన్ ఎం.బాబు రావు, జేవీ శ్రీధర్, టీ పరమే శలింగం, కే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**● నెల్లూరు చెరువులో ఆక్రమణలు తొలగించండి**

**నెల్లూరు(వైద్యం) :** భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని ఏపీ లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ ఆర్కిటెక్ట్ సివిల్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లలితారామ్ అన్నారు. ఆదివారం నగరంలోని ఆమని గార్డెన్స్‌లో జరిగిన ఇంజనీర్ల దినోత్సవంలో ముందుగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరు చెరువులో 100 ఎకరాలు ఆక్రమణకు గురయ్యా యన్నారు. అలాగే నీటి పారుదల కాలువలపై ఉన్న ఆక్రమ ణలను తొలగిస్తే భారీ వర్షాలకు నెల్లూరుకు ముప్పు తొలగు తుందని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి గిరీష్, కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర గౌరవ సలహాదారు శేషారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లలితారామ్

# గర్భకోశ వ్యాధులకు ఆధునిక వైద్యంపై సదస్సు

**నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 15 :** గర్భకోశ వ్యాధుల చికిత్సకు సంబంధించిన ఆధునిక వైద్య విధానాలను ఎప్పటికప్పుడు వైద్యులు తెలుసుకోవాలని గైనకాలజీ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పల్లంరెడ్డి యశోధర అన్నారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో గైనకాలజీ సొసైటీ మేధోసదస్సు నిర్వహించింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ యశోధర మాట్లాడుతూ గర్భిణులకు మూడో నెల దాటిన తర్వాత అబార్షన్ చేస్తే తల్లికి కూడా ప్రమాదం కలిగే అవకాశం లేకపోలేదన్నారు. వయసు మీరిన గర్భవతులకు ఏసీయూలో చికిత్స 30 శాతం ఎక్కువగా ఉంటుందని తెలియచేశారు. గర్భిణులు, కాన్పులకు సంబంధించిన పలు అంశాలను వివరించారు. ఈ సదస్సుకు ప్రకాశం, తిరుపతి, కడప జిల్లాలకు చెందిన వైద్య నిపుణులు కూడా హాజరయ్యారు. ఐఎంఏ రాష్ట్ర నాయకుడు డాక్టర్ అశోక్, సదస్సు నిర్వహణ కమిటీ అధ్యక్షురాలు డాక్టర్ సుప్రజ, కార్యదర్శి డాక్టర్ లలితా శిరీషా, కోశాధికారి డాక్టర్ చైతన్య పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ పెంచలయ్య

# రిజిస్ట్రార్ ఆఫీసుల్లో మర్యాద పూర్వక సేవలు

- రాచరికపు పోకడలకు స్వస్తి
- ప్రభుత్వం ఆదేశాలు జారీ


సబ్ రిజిస్ట్రార్ పోడియం తొలగించి ఏర్పాటు చేసిన కుర్చీలు

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 15: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రాచరికపు పోకడలకు ప్రభుత్వం స్వస్తి పలికింది. ఇక నుంచి ప్రజలతో అధికా రులు స్నేహపూర్వకం గా ఉండేలా చర్యలు తీసుకుంది. సబ్ రిజిస్ట్రార్లు కూర్చునే కుర్చీ ఎత్తు తగ్గించటమే కాకుండా, వారి ముందుండే పోడియాన్ని ఎత్తేయాలని ఆదేశాలు వచ్చాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పోడియం చెక్కతో ఉంటుంది. దాని చుట్టూ ఎరుపు రంగు వస్త్రం ఉంటుంది. సబ్ రిజిస్ట్రార్ కుర్చీ, ఆయన ముందుండే టేబుల్ చుట్టుపక్కల ఉన్న ఫ్లోరింగ్ కంటే కొంచెం ఎత్తులో ఉంటాయి. రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారు, ఎత్తులో ఉన్న సబ్ రిజిస్ట్రార్ పోడియం ముందు నిలబడి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి. ఈ విధానం అమర్యాదకరంగా ఉందని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య అంతరం పెంచేలా ఉందని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా అభిప్రాయపడ్డారు. రిజిస్ట్రేషన్‌శాఖ ద్వారా ప్రభుత్వానికి పన్నులు కడుతున్న ప్రజలకు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తగిన గౌరవ మర్యాదలు ఇవ్వాలని పేర్కొంటూ ఆయన మెమో జారీ చేశారు. తక్షణమే సబ్ రిజిస్ట్రార్ల ముందుండే పోడియంను తొలగించాలని ఆదేశించారు. సబ్ రిజిస్ట్రార్ కుర్చీని కూడా సాధారణ ఫ్లోరింగ్ ఎత్తులోనే ఉంచాలని సూచించారు. సబ్ రిజిస్ట్రార్‌కు ప్రజలకు మధ్య టేబుల్ తప్ప మరేమి ఉండకూడదని ఆదేశించారు. దీంతో జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు అన్ని కార్యాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

## భార్యపై భర్త కత్తితో దాడి

**సంగం, సెప్టెంబరు 15:** తలుపూరుపాడులో ఓ వ్యక్తి మద్యం మత్తులో తన భార్యపై కత్తితో దాడి చేసిన సంఘటన ఆదివారం జరిగింది. దీంతో ఆమె పోలీసులకు 100 ఫోన్ కాల్ చేసింది. స్పందించిన పోలీసులు ఆమె భర్తను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అయితే తన భర్తపై కేసు నమోదు చేయవద్దని భార్య పోలీసులను ప్రాధేయపడింది. దీంతో కేసు నమోదు చేయలేదు.

## రైలు పట్టాలపై మృతదేహం గుర్తింపు

**కావలి రూరల్, సెప్టెంబరు 15:** పట్టణ రైల్వే స్టేషన్‌లోని 3వ నెంబరు ప్లాట్ ఫాం వద్ద గుర్తుతెలియని సుమారు 35ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం జీఆర్పీ పోలీసులు గుర్తించారు. రైల్వే ప్లాట్ ఫాం దాటుతుండగా రైలు ఢీ కొని మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోగా తెలుపు, బులుగు రంగుల చొక్కా, బ్లూ, పింక్ కలర్ బులుగు లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు.

## ఆటో బోల్తా : ముగ్గురికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన మహిళలకు సపర్యలు చేస్తున్న ప్రయాణికులు

**మనుబోలు, సెప్టెంబరు 15:** చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై మండల పరిధిలోని మనుబోలు పామాయిల్ పరిశ్రమ సమీపంలో ఆటో బోల్తాపడి ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాల మేరకు.. ఆదివారం కాగితాలపూరుకు చెందిన ఆటో ప్రయాణికులను తీసుకుని జరుగుమల్లికి వెళు తోంది. జాతీయ రహదారిపై ఆటోను అధిగమించిన కారు సడన్ బ్రేక్ వేయడంతో ఆటో వేగాన్ని అదుపుచేయలేక డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జట్లకొండూరుకు చెందిన వెంకటరమణమ్మ, కాగితాలపూరుకు చెందిన మారు మంగమ్మ, మారు పద్మమ్మలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కిలాడి దొంగ అరెస్టు

- తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు
- రూ.17లక్షల సొత్తు రికవరీ


నిందితుడి వివరాలు తెలుపుతున్న రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు

**నెల్లూరు(క్రైం/రూరల్): సెప్టెంబరు 15:** చెడు వ్యసనాలకు బానిసై, విలాసవంతమైన జీవితం కోసం దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వివరాలను నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఆదివారం నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో మీడియాకు వెల్లడించారు. జిల్లాలోని విడవలూరు మండలం వావిళ్ల గ్రామానికి చెందిన మడపర్తి సతీష్ కుమార్ పాత నేరస్తుడు. విడవలూరు, బుచ్చి, సంగం, ఇందుకూరుపేట పోలీసుస్టేషన్లలో అతనిపై కేసులు ఉన్నాయి. విడవలూరు పోలీసుస్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ కూడా ఉంది. ఇటీవల నెల్లూరు రూరల్, ఇందుకూరుపేట, వెంకటాచలసత్రం మండలాలు, నెల్లూరు నగరంలో వరుస దొంగతనాలు జరిగాయి. దీంతో రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు పర్యవేక్షణలో నెల్లూరు రూరల్ సీఐ జీ వేణు, సీసీఎస్ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. నెల్లూరు రూరల్ ప్రాంతంలో ఆదివారం సతీష్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా వరుస దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడు.

### జైలు నుంచి రాగానే మళ్లీ చోరీలు

గతంలో చేసిన నేరాలకుగాను సతీష్ కుమార్ జైలు జీవితం గడిపి ఈ ఏడాది మే 14న కారాగారం నుంచి విడుదలయ్యాడు. ఆ వెంటనే మళ్లీ చోరీలకు పాల్పడటం మొదలుపెట్టాడు.

- జూన్ 15వతేదీ రాత్రి నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్లలో ఓరుపల్లి అశోక్ కుమార్ కుటుంబం ఇంటి బయట నిద్రిస్తుండగా ఇంటి లోపలికి వెళ్లి బీరువాలో ఉన్న 12 సవర్ల బంగారం, 100 గ్రాముల వెండి దోచుకెళ్లాడు.
- జూలై 24వతేదీ ఇందుకూరుపేట మండలం పల్లెపాడులో ములుముడి చిట్టెమ్మ కుటుంబం ఊరెళ్లగా వారి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న 30 గ్రాముల బంగారు నగలు దోచుకెళ్లాడు.
- ఆగస్టు 29వతేదీ రాత్రి వెంకటాచలం మండలం కసుమూరులో వేమాల తిరుపతమ్మ కుటుంబం ఇంటి బయట నిద్రిస్తుండగా లోపలికి ప్రవేశించి బీరువాలోని ఏడున్నర సవర్ల బంగారం, రూ. 1.75 లక్షల నగదును దోచుకెళ్లాడు.
- ఈ నెల 12వతేదీ ఉదయం లక్ష్మీ ప్రసన్న అనే వృద్ధురాలు నెల్లూరు ఆర్టీసీ ప్రధాన బస్టాండులో బస్సు కోసం వేచి ఉండగా ఆమె హ్యాండ్ బ్యాగ్‌లోని 12.5 సవర్ల బంగారు ఆభరణాలు దోచుకెళ్లాడు.
- పోలీసులు నిందితుడు సతీష్ కుమార్‌ను అరెస్టు చేసి అతని వద్ద రూ. 17 లక్షల విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరచిన రూరల్ డీఎస్పీ ఘట్ట మనేని శ్రీనివాసరావు, రూరల్ ఇన్‌స్పెక్టర్ జీ వేణు, ఎస్ఐ లక్ష్మణరావు, హెడ్ కానిస్టేబుళ్లు ప్రసాద్, ఆదినారాయణ, కానిస్టేబుళ్లు అల్లాభక్షు, శ్రీనివాసులు, సీసీ సిబ్బంది జే వెంకయ్య, వారిస్, భాస్కర్‌లను ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

### చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 127 |
| లేయర్ లైవ్ | 110 |
| స్కిన్ చికెన్ | 230 |
| స్కిన్‌లెస్ | 254 |
| లేయర్ | 187 |

### బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ.6865 |
| వెండి కిలో ధర | రూ. 90,100 |
| వెండి ఒక గ్రాము | రూ. 93.10 |

## 19 నుంచి వ్యాసరచన పోటీలు

**నెల్లూరు (సాంస్కృతికం):** విద్యార్థుల్లో సాహిత్యంపై ఆసక్తిని పెంచేందుకు ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు పాఠశాల, కళాశాలల్లో పద్య, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు సమరసత వేదిక నాయకుడు కోడూరు సత్యం తెలిపారు. ఆదివారం నెల్లూరులోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో ఆ వేదిక సమావేశం జరిగింది. ప్రముఖ సాహితీవేత్తలు యువతకు ఆదర్శం కావాలన్న ఉద్దేశంతోనే ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, మాధవరావు, మోమిడి శ్రీనివాసులు, జయప్రకాష్, సుబ్బరాయులు, జయప్రద, భువనమ్మ, కార్యదర్శి కేశవులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదస్థాయిలో ఓజోన్ పొర

- నేడు అంతర్జాతీయ ఓజోన్‌పొర పరిరక్షణ దినం

- జీవకోటి మనగడకు పొంచి ఉన్న ముప్పు
- కేన్సర్, చర్మవ్యాధుల బారిన మానవాళి
- అధిక భూతాపం మరో కారణం
- మేలుకోకుంటే ఇబ్బందులే..




> ఓజోన్ పొర దెబ్బతిన్న కారణంగా జిల్లాలో ఎంతో మంది కేన్సర్ బారిన పడుతున్నారు. ప్రకృతిపరంగా మన తప్పిదాల వల్ల ప్రాణకోటికి జీవనాధారమైన ఓజోన్ పొర వినాశనానికి కారణమవుతున్నాం. స్క్వామస్ సెల్ కేన్సర్, బేసాల్ సెల్ కేన్సర్, మాలిజెంట్ మెలినోమా వంటి కేన్సర్‌లకు గురవుతున్నారు. ఇందులో మాలిజెంట్ మెలినోమా అత్యంత ప్రమాదకరమైనది. మిగిలిన రెండు రకాల కేన్సర్‌లను నయం చేయవచ్చు. అయితే ఈ మూడో రకం కేన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి.
>
> **- డాక్టర్ గీతా ఉషశ్రీ, కేన్సర్ వైద్య నిపుణులు, రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రి**

కేన్సర్ బారిన ఎంతోమంది



**నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 15 :** సాంకేతిక పరిజ్ఞానం మాటున పెను ప్రమాదం కూడా పొంచి ఉంది. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞా నంతో ఎంతో ప్రగతి సాధించామని గొప్పలు చెబుతున్నా, అది జీవకోటి మనుగడకు ప్రశ్నార్థకరంగా మారుతుంది. వీటి వల్ల పొంచి ఉండే ప్రమాదాల గురించి ఆలోచించక పోవటం వల్ల అనేక జీవరాసులతో పాటు మనిషి కూడా మృత్యువు వైపు పరుగులు తీస్తున్నాడు. ఇందుకు నిదర్శనమే ఓ జోన్ పొర ప్రమాద స్థాయికి చేరుకోవటం. సూర్యుడి నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమిమీద పడటం వల్ల సకల జీవరాసులకు ముప్పు వాటిల్లుతుంది. ఆ వేడిన తట్టుకునే సామర్థ్యం భూమిపై నివసించే జీవరాసులకు లేదనే చెప్పాలి. మనుషులు సైతం తట్టుకోలేని పరిస్థితి తలెత్తుతుంది. భూమికిపైన 15 నుంచి 25 కిలోమీటర్ల వరకు ఉండే ఓజోన్ పొర సూర్యుడి నుంచి వెలువడే కిరణాలు నేరుగా భూమిపైకి చేరకుండా సంగ్రహిస్తుంది తద్వారా ప్రాణికోటికి వాటిల్లే ముప్పు నుంచి కాపాడుతుంది. ఈ క్రమంలో గత 30 ఏళ్ల నుంచి ఓజోన్ పొర క్షీణిస్తుందని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. భవిష్యత్తులో జీవకోటికి తలెత్తే ముప్పును గమనించిన ఐక్యరాజ్యసమితి ఓజోన్ పరిరక్షణ కోసం సెప్టెంబరు 16న (నేడు) ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినంగా జరుపుకోవాలని తీర్మానిం చింది. ప్రజలలో దీనిపై అవగాహన పెంచేలా కార్యక్రమాలను రూపొందించింది.

**● జిల్లాలో పరిస్థితి**

జిల్లాలో ఓజోన్ పొర ప్రమాదకర స్థాయిలో ఉంది. ప్రకృతి పరంగా కాలుష్యం పెరుగుతుంది. జిల్లాలోని గ్రామాల నుంచి అనేక మంది పట్టణాలకు వలసల బాట పట్టటంతో కాలుష్యం పెరిగిపోతూ ఉంది. ఇబ్బడి ముబ్బడిగా మోటారు వాహనాలు పెరగడం, పరిశ్రమల కాలుష్యం, అధికశాతం మంది ఏసీల వినియోగం ఓజోన్ పొరకు చేటు తెస్తున్నదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. హేలోన్స్, మిథైల్ క్లోరోఫాం, మిథైల్ బ్రోమైడ్, హైడ్రోకార్బన్‌లు, సీఎఫ్‌సీ వంటి రసాయనిక వాయువులు ఓజోన్ పొరను ప్రమాదం వైపు తీసుకువెళుతు న్నాయి. ఏరోసోల్ ఉత్పత్తులు, రిఫ్రీజిరేటర్లు, ఎయిర్ కండీషనర్లు, ఫోం బ్లోయింగ్ ఉత్పత్తులు, అధికంగా స్ప్రేల వినియోగం వల్ల ఓజోన్ ముప్పు వాటిల్లుతున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం బుతువులు గతి తప్పటం, వేసవి తీవ్రత వంటి సమస్యలకు మానవ తప్పిదమేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో పరిమితులకు మించి నీటి వియోగం వల్ల ఓజోన్ పొరకు ప్రమాదం ఏర్పడుతుంది. నీటి వాడకం తగ్గించి, ప్లాస్టిక్ వినియోగంను కూడా తగ్గించ కలిగితే ఓజోన్ పొరను రక్షించుకోవచ్చని మేధావులు చెబుతున్నారు. ఓజోన్ పొర ప్రమాదకర స్థాయికి చేరితే మానవాళికి ప్రాణాధారమైన ఆక్సిజన్ అందే పరిస్థితి ఉండదు. ఈ పరిస్థితిలో శాస్త్రవేత్తల సూచనలను పాటించకపోతే భవిష్యత్తు ప్రమాదకరంగా ఉంటుంది.

**● కేన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు**

ఓజోన్ పొర దెబ్బతినటం వల్ల నేరుగా అతినీలలోహిత కిరణాలు భూమిని తాకటంతో కేన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలుతున్నాయి. ఏటా ప్రపంచవ్యాప్తంగా 30 లక్షల మంది అతినీల లోహిత కిరణాల కారణంగా చర్మ కేన్సర్‌కు గరవుతున్నారని ప్రపంచ ఆరోగ్యసంస్థ తెలియచేస్తున్నది. దీనితోపాటు నేత్ర వ్యాధులు, జన్యుపరమైన వ్యాధులు సంక్రమిస్తున్నాయి. సముద్ర జీవ రాశి కూడా నశించిపోయే పరిస్థితి వస్తున్నది. దీంతో పాటు జన్యు పరమైన సమస్యలు తలెత్తటంతో పుట్టే పిల్లలో అంగ వైకల్యం వచ్చే అవకాశం ఎక్కువని వైద్యులు చెబుతున్నారు.

### తీవ్ర అనారోగ్యాల పాలు



ప్రస్తుత పరిస్థితిలో ఓజోన్ పొర దెబ్బతినటం కారణంగా మనిషి తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. ఎప్పుడూ చూడని వింత వ్యాధులు సైతం వెలుగుచూస్తున్నాయి. ఓజోన్ పొర దెబ్బతినటం వల్ల అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమిపైకి చేరటం వల్ల చర్మ వ్యాధులు ప్రబలు తున్నాయి. ఈ పరిస్థితిలో ఓజోన్ పొర పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి. ఇందుకు విరివిగా మొక్కలు పెంచాల్సిన అవసరం ఉంది.

**- డాక్టర్ సుబ్రహ్మణ్యం, జీజీహెచ్ వైద్యులు**

### నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

**నెల్లూరు (హరనాథపురం/క్రైం), సెప్టెంబరు 15 :** మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో, పోలీసు కవాతు మైదానంలో జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాలను రద్దు చేసినట్లు కలెక్టర్ ఆనంద్, జిల్లా పోలీసు కార్యాలయం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నాయి. జిల్లా ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు హాజరుకావద్దని కోరాయి.

## డీఎస్పీల బదిలీ

**నెల్లూరు(క్రైం): సెప్టెంబరు 15:** రాష్ట్ర వ్యాప్తంగా 47 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా కావలి డీఎస్పీగా పని చేస్తున్న వెంకట రమణ పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న పీ శ్రీధర్‌ను నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న ఎం గిరిధర్‌రావుని నెల్లూరు జిల్లా పోలీసు ట్రైనింగ్ కళాశాల డీఎస్పీగా నియమించారు. కందుకూరు డీఎస్పీ ఏ శ్రీనివాసరావుని గుంతకల్లు డీఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు.

## రాష్ట్రస్థాయి టైరు బండి ఎడ్ల పరుగు పందెం


విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు బాలకృష్ణం రాజు

**అల్లూరు, సెప్టెంబరు 15 :** రాష్ట్రస్థాయి జూనియర్ టైరు బండి ఎడ్ల పరుగు పం దెం పోటీలను ఆదివారం మండలకేంద్రంలో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 3వరకు జరిగిన ఈ పోటీల్లో మొత్తం 17ఎడ్ల జతలు పాల్గొన్నాయి. ఐదు స్థానాల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం చేశారు. అల్లూరు ఎస్ఎస్ బ్రదర్స్ ఎడ్ల జత ప్రథమస్థానంలో నిలవగా వారికి మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి సమకూర్చిన రూ.25,116 నగదుతో పాటు బహుమతిని అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన ఇస్కపల్లి పాపనబోయిన జ్యోతిశ్రీ ఎడ్ల జతకు దండా కృష్ణారెడ్డి రూ.20,116 నగదుతో పాటు బహుమతిని అందజేశారు. ఇందుకూరుపేట మండలం గంగపట్నం చాముండేశ్వరి సీఫుడ్స్‌కు చెందిన ఎడ్ల జత మూడవ స్థానంలో నిలిచింది. వారికి మన్నెమాల నారపరెడ్డి జ్ఞాపకార్థం కుమారుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి రూ.15,116, విడవలూరు మండలం ముదివర్తికి చెందిన తలారి భావిక ఎడ్ల జత నాలుగో స్థానంలో నిలిచింది. వీరికి కరేటి వినోద్‌కుమార్ జ్ఞాపకార్థం తల్లిదండ్రులు కరేటి దైవాదీని, చంద్రలీలమ్మలు రూ.10,116 అందజేశారు. ఐదో స్థానంలో కొడవలూరు మండలం యల్లాయపాలెం అత్తిరాజుల లాస్య ఎడ్ల జతకు పప్పు వెంకయ్య జ్ఞాపకార్థం పప్పు సుధాకర్, పప్పు శీనయ్య, పప్పు శ్రీహరిలు రూ.7,116లు అందజేశారు. కార్యక్రమంలో దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, గోపాల్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, పప్పు సుధాకర్, కరుణాకర్ పాల్గొన్నారు.

## కోనలో పవిత్రోత్సవాల ప్రారంభం

**రాపూరు :** పెంచలకోన క్షేత్రంలో పవిత్రోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీవార్లకు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, స్నాపన తిరుమంజనం, శ్రీవారి పవిత్రాల ప్రతిష్ఠ, ఆదివాస హోమం, ఆదివాస పవిత్ర సమర్పణ, నివేదన, శాత్తుమురై కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛరణలతో చేపట్టారు. కార్యక్రమంలో ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి కేవీ.సాగర్‌బాబు ఉన్నారు.


పవిత్రాలు తీసుకువస్తున్న ఆలయ అర్చకులు


విఘ్నేశ్వరుడికి 150 రకాల ప్రసాదాలను అందచేసిన భక్తులు

## బొజ్జ గణపయ్యకు 150 రకాల ప్రసాదాలు

**బిట్రగుంట, సెప్టెంబరు 15:** బోగోలు మేజర్ పంచాయతీ రైస్‌మిల్లు సెంటర్లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథుడికి 150రకాల ప్రసాదాలను ఆదివారం భక్తులు స్వామికి నైవేద్యంగా పెట్టారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు లడ్డూ వేలం చేపట్టగా గురుజాడ లక్ష్మయ్య, సుజాత దంపతులు రూ.5,200లకు పాడి దక్కించుకున్నారు. అనంతరం మేళతాళాలు, కోలాటం, భజన నృత్యాలతో నిమజ్జనానికి తరలివెళ్లారు. బోగోలు, విశ్వనాథరావుపేట తదితర గ్రామ పంచాయతీల నుంచి 12విగ్రహాలు సముద్రంలో నిమజ్జనానికి వచ్చినట్లు స్థానికులు తెలిపారు.

## ఇద్దరు ఉపాధ్యాయులకు తెలుగు వెలుగు నంది పురస్కారం



నంది జాతీయ పురస్కారం అందుకుంటున్న తాటికొండ మోహన్, కోడిగుంపల శ్రీనివాసులు

**సంగం/ఉదయగిరిరూరల్, సెప్టెంబరు 15:** జిల్లాలోని ఇద్దరు ఉపాధ్యాయులు తెలుగు, వెలుగు నంది జాతీయ పురస్కారాలను అందుకున్నారు. ఆ వివరాలు... సంగం మండలం దువ్వూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు తాటికొండ మోహన్‌కు తెలుగు వెలుగు సాహితీ వేదిక నిర్వాహకులు జాతీయ నంది పురస్కార అవార్డు అందజేశారు. తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని ఆ విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో అవార్డు అందచేసి సన్మానించారు. విద్యారంగానికి ఆయన చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డు అందచేసింది. కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ అధ్యక్షులు రాజ్‌కుమార్, పూర్వ నాసా శాస్త్రవేత్త సాంబశివరావు, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యులు వెంకటేశ్వర్లు, నవ మల్లెతీగ సంపాదకులు కలిమిశ్రీ, శ్రీకృష్ణదేవరాయలు పాలకమండలి పూర్వ సభ్యులు సుదాకర్ బాబు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఆయనకు ఎంఈవో జానికీరామ్, మల్లయ్యలతో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఉదయగిరి మండలంలోని శకునాలపల్లికి చెందిన కోడిగుంపల శ్రీనివాసులకు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని ఆదివారం విజయవాడలో నిర్వహించిన తెలుగు వెలుగు జాతీయ నంది పురస్కారాల మహోత్సవంలో భాగంగా జాతీయ పురస్కారం అందుకొన్నాడు. శ్రీనివాసులు సమాజసేవా, అన్నమయ్య సంకీర్తనల ఆలాపన, మ్యూజిక్ రంగాల్లో తన ప్రతిభ కనపర్చడంతో సంస్థ జాతీయ నంది పురస్కారానికి ఎంపిక చేసింది. దీంతో ఆయన నాసా సాంబశివారావు, శాంతిభాయ్, రాష్ట్ర తెలుగు వెలుగు సాహిత్య వేదిక సంపాదకుల చేతుల మీదుగా పురస్కారం అందుకొన్నారు.

# ఆక్వా రైతులకు మంచి రోజులు

- ఆశాజనకంగా రొయ్యల ధరలు
- పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- గత ప్రభుత్వంలో మొండిచేయి
- ప్రస్తుతం ప్రాధాన్యం


గుంటల నుంచి పట్టిన రొయ్యలు

**అల్లూరు, సెప్టెంబరు 15 :** కొంతకాలంగా వైట్‌స్పాట్ సమస్యతో బాధపడుతున్న ఆక్వా రైతులకు ఇటీవల పెరిగిన ధరలతో వారిలో ఆశ లు చిగురించాయి. గత ఐదేళ్లలో ఆక్వా రంగానికి ఎలాంటి సహకారం అందించని ప్రభుత్వంతో రైతులు విసిగివేసారి పోయారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఆక్వా రంగానికి ప్రాధాన్యతను కల్పించింది. దీంతో రొయ్యల ధరలు పెరిగాయి. ఈ ప్రభుత్వంలో నిర్ణయించిన ధరలతో ఆక్వా రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

**● వరంగా పెరిగిన ధరలు**

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పెరిగిన ధరలు ఆక్వా రైతులకు వరంగా మారాయి. గత ఐదేళ్ల పాలనలో ఆక్వా రైతులను పట్టించుకున్న నాథుడు కరువయ్యాడు. నూతన ప్రభుత్వంలో ధరలు పెరగడంతో ఆక్వా రంగానికి ఉపశమనం కల్పించినట్టయింది. ఆక్వా సాగులో జిల్లా పేరుగాంచింది. ఇక్కడ అత్యధికమంది రైతులు రొయ్యల సాగుపై దృష్టి సారిస్తుంటారు. వెనామీ రకం సాగు చేపట్టినప్పటి నుంచి ఉమ్మడి జిల్లాలో రైతులు సాగుపై ఆసక్తిని కనపరిచినా వరుస నష్టాలతో కోలుకోలేక 70 శాతం మంది ఆక్వా రంగాన్ని విడనాడారు. మిగిలిన 30 శాతం మంది కష్టమో నష్టమో ఆక్వాపైనే ఆధారపడ్డారు.

**● పెరుగుతున్న సాగు విస్తీర్ణం**

గత టీడీపీ ప్రభుత్వంలో ముమ్మరంగా సాగు చేపట్టిన రైతులు గత ఐదేళ్లలో ఈ రంగాన్ని విడనాడి ఇతరత్రారంగాల్లోకి వెళ్లారు. మళ్లీ టీడీపీ ప్రభుత్వం రావడంతో రైతుల ఆశలు చిగురించాయి. దీంతో తాజాగా ఉమ్మడి జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా విస్తీర్ణంలో రొయ్యల పెంపకం చేపట్టేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. దీంతో బీడుబారిన గుంటలకు మరమ్మతులు చేపట్టి రొయ్యల సాగుకు సన్నద్ధం అవుతున్నారు.

**● తాజా ధరలు**

100 కౌంట్ రొయ్యలు గతంలో రూ.200లోపు ఉండగా,ప్రస్తుతం రూ.260 పలుకుతోంది. 80 కౌంట్ రూ.290, 70 కౌంట్ రూ.310, 60 కౌంట్ రూ.330, 50 కౌంట్ రూ.350, 40 కౌంట్ రూ.390, 30 కౌంట్ రూ. 500 పలకడంతో రైతుల్లో ఎన్నడూలేని ఉత్సాహం నెలకొంది.

### ధరలు ఆశాజనకం



పదేళ్లుగా రొయ్యల పెంపకం చేపట్టా. నష్టాలు రావడంతో ఈ ఏడాదైనా ఆశాజనకంగా ఉంటుందని మళ్లీ సాగు చేస్తున్నా. నూతన ప్రభుత్వంలో ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఆసక్తి పెరిగింది. గతంలో చేసిన అప్పులు పెరిగిన ధరలతో తీరిపోవాలి.

**- కత్తుల విజయ్‌కుమార్, ఆక్వా రైతు, అల్లూరు**

### ధరలు స్థిరంగా ఉంటే చాలు



గత ఐదేళ్లలో వచ్చిన నష్టాలు పెరిగిన ధరలతో తొలగిపోవాలి. పెరిగిన ధరలు స్థిరంగా ఉంటే అంతే చాలు. ఎంత కష్టపడి అయినా ఆక్వాసాగు చేపడతాం. ప్రభుత్వం సహకరిస్తే ఆక్వారంగాన్ని ఇంకా ముందుకు తీసుకువెళ్తాం.

**- నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, ఆక్వా రైతు, అల్లూరు**

# కావలి
## కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

## మాజీ ఎంపీపీ నర్రా కాంతమ్మ మృతి

**కొండాపురం, సెప్టెంబరు 15:** మండల మాజీ అధ్యక్షురాలు నర్రా కాంతమ్మ (70) శనివారం మృతి చెందారు. తెలుగుదేశంలో ముఖ్య నాయకుడిగా ఉన్న స్వర్గీయ పోలినేని పెదమాల కొండయ్య సోదరి ఈమె. 2001-2005 మధ్య కాలంలో ఎంపీపీగా పనిచేశారు. అప్పటి ఎమ్మెల్యే వంటేరు వేణుగాపాలరెడ్డి సహకారంతో మండలంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. నాయకులు ఆదివారం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎమ్.ఓంకారం, నాయకులు పోలినేని రమేష్, పోలినేని చంద్రబాబడునాయుడు, యారవ క్రిష్ణయ్య, బొట్లగుంట హరిబాబు, మక్కెన అంకయ్య చౌదరి, తల్లపనేని లక్ష్మీనారయణ, వల్లూరు వెంకటేశ్వర్లు, మామిళ్లపల్లి వెంకటరమణయ్య పాల్గొన్నారు.

## ఈగ శ్రీనివాసులురెడ్డి వర్ధంతి



అన్నదానం చేస్తున్న ఐక్య ఫౌండేషన్ నిర్వాహకులు

**ఆత్మకూరు, సెప్టెంబరు 15:** అప్పారావుపాళెం గిరిజనకాలనీలో ఐక్య ఫౌండేషన్ సభ్యులు ఆదివారం కడప జిల్లా ఉడుమువారిపల్లికి చెందిన ఈగ శ్రీనివాసులురెడ్డి మొదటి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐక్య ఫౌండేషన్ ఛైర్మన్ పయ్యావుల రామకృష్ణ, డైరెక్టర్ మరుతీనాయుడు, ఈగ పృధ్వీందర్‌రెడ్డి, ఈగ ప్రభుదర్‌రెడ్డి, ప్రభావతమ్మ, కామాక్షయ్య, పావని పాల్గొన్నారు.

## ఏచూరి సీతారాంకి నివాళి



నివాళులర్పిస్తున్న వామపక్ష నాయకులు

**జలదంకి, సెప్టెంబర్ 15:** స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం సీతారాం ఏచూరి మృతికి సంతాపంగా ఆదివారం వామపక్ష నాయకులు, ఎమ్మార్పీఎస్ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లూరి మాల్యాద్రి, రావి మాల్యాద్రి, దమ్ము దర్గాబాబు, మేలంగి ఆంథోనీబాబు, గోచిపాతల వెంకటేశ్వర్లుమాదిగ పాల్గొన్నారు.

## సదస్సును జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

**కందుకూరు, సెప్టెంబరు 15:** ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన వర్గీకరణ, క్రిమిలేయర్ తీర్పును పునఃపరిశీలించి రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 22న ఒంగోలులోని అంబేద్కర్ భవన్ ఓపెన్ ఆడి టోరియంలో జరుగుతున్న సభను జయప్రదం చేయాలని దళితసం ఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు కోరారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో ఆది వారం సాయంత్రం నిర్వహించిన మాలల చైతన్య కార్యక్ర మంలో ఆయన పాల్గొని గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్యాంప్రసాద్, వెంకటేశ్వర్లు, కోటి పాల్గొన్నారు.

## తరగతి గదుల నిర్మాణం
# అర్ధంతరంగా ఆగిపోయె!

- విడుదల కాని రెండోవిడత నాడు-నేడు నిధులు
- మండలంలోని 19 పాఠశాలల్లో ఇదీ పరిస్థితి
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

**లింగసముద్రం, సెప్టెంబరు 15:** గత వైసీపీ ప్రభుత్వం 2021లో మండలం లో నాడు-నేడు రెండోవిడత కింద ప్రారంభించిన పనులు అర్ధాంతరంగా నిలిచిపో యాయి. ఆ నిధులు ఇప్పటికీ విడుదల కాకపోవడంతో సరిపడా తరగతిగదులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో 17పా ఠశాలలు, 2అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మించేందుకు అప్పటి వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద రూ.6.74కోట్లు మంజూరు చేసి వాటిలో రూ.2.87 కోట్లు వి డుదల చేసింది. ఈ నిధులతో అధికారులు లింగసముద్రంలోని కేజీబీవీ, వీఆర్.కోట, మొగిలిచెర్ల హైస్కూళ్లతో పాటు మరో 12ప్రాథమిక, 2యూపీ పాఠశాలలు, 2అంగ న్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు ప్రారంభించారు. ఈ పాఠశాలల్లో అదనపు తర గతి గదులు, బాతురూంలు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడల నిర్మాణ పనులు, టైల్స్, తలుపులు, గదుల మరమ్మతులు పనులు చేపట్టారు. అయితే విడుదలైన నిధుల లో రూ.2.75కోట్లతో పనులు చేశారు. మిగిలిన రూ.12 లక్షలతో ముక్తేశ్వరం, అన్నెబో యినపల్లి పాఠశాలల్లో పనులు చేస్తున్నారు. అయితే ప్రభుత్వం మిగిలిన నిధులు రూ.3.87కోట్లు విడుదల చేయక పోవడంతో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి పనులు నిలిచిపోయాయి. కేజీబీవీలోనూ అదే పరిస్థితి నెలకొంది.



లింగసముద్రం కేజీబీవీలో నిలిచిన తరగతి గదుల నిర్మాణం

## దగదర్తి-బుచ్చిరెడ్డిపాలెం
# రోడ్డు నిర్మాణ పనుల పునఃప్రారంభం

- భూమిపూజ చేసిన ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి

**దగదర్తి (విట్రగుంట) సెప్టెంబరు 15:** మండలంలోని దగదర్తి-బుచ్చిరెడ్డిపాలెం మధ్య ఉన్న ప్రధాన రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పునఃప్రారంభంచారు. దగదర్తికి చేరుకున్న ఆయనకు టీడీపీ రాష్ట్రకార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీతో పూజస్థలం వరకు స్వాగతం పలికారు. భూమి పూజ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఈ రోడ్డు పనులు నిలిచిపోయినట్లు చెప్పారు. రోడ్డు నిర్మాణానికి కొంత రైతుల భూమి కావాల్సి ఉంటుందని వారికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం చెల్లించైనా పనులు చేపడతాం అన్నారు. రాజకీయ విభేదాలు విడిచి గ్రామాల అభివృద్ధికి కృషి చేదాం అని పిలుపునిచ్చారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజులకే తుమ్మలపెంట, దగదర్తి బుచ్చిరెడ్డిపాలెం రోడ్డు పనులు ప్రారంభించామని.. త్వరలో అల్లూరు రాజుపాలెం రోడ్డు పనులు ప్రారంభిస్తాం అన్నారు. గ్రామాలను అనుసంధానం చేస్తున్న లింకు రోడ్లను గుర్తించి ఉపాధి హామీ పనుల కింద పనులు జరిగేలా చూస్తామన్నారు. డీఎం, డీఆర్ చానల్ పనులు త్వరలో పూర్తి చేసి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దగదర్తిలో ఎయిర్‌పోర్టు నిర్మాణంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకశ్రద్ధ చూపుతున్నాడని వీలైనంత తొందర్లో ఆయన పర్యటించనున్నట్లు చెప్పారు. రామయ్యపట్నం పోర్టుకు అనుసంధానంగా పరిశ్రమ ఏర్పాటు చేస్తే 40వేల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కావలి డీఎస్పీ వెంకటరమణ, సీఐ పాపారావు, బీజేపీ రాష్ట్ర నాయకులు భరత్‌కుమార్ యాదవ్, పార్టీ మండలాధ్యక్షుడు అల్లం హనుమంతరావు, నేతలు చేజర్ల ఇద్రిస్, జలదంకి శ్రీహరినాయుడు, చెన్నూరు సర్పంచు నాయక్, రెడ్డిమాచి రవీంద్ర, శేషారెడ్డి, పులి శీనయ్య, మల్లికార్జునరెడ్డి, ప్రతాప్, జనసేన నేత వెంకట్ పాల్గొన్నారు.

## నిమజ్జనానికి తరలిన వినాయక విగ్రహాలు

**లింగసముద్రం, సెప్టెంబరు 15** : మొగిలిచెర్ల, లింగసముద్రంలో గణేష్ విగ్రహాల నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. మొగిలిచెర్లలో టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు ఆధ్వర్యంలో వేడుకలు చేపట్టారు. విగ్రహాల ఊరేగింపులో యువకులు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. అనంతరం గణేష్ విగ్రహాలను రాళ్లపాడు మన్నేరులో నిమజ్జనం చేశారు. మొగిలిచెర్లలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ షేక్ మహబూబ్ సుబానీ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



మర్రిచెట్టు గిరిజనకాలనీలో వినాయకుడి గ్రామోత్సవం

**కావలి టౌన్:** పట్టణంలోని ముసునూరు గిరిజనకాలనీతో పాటు పలు కాలనీల్లోని వినాయక విగ్రహాలను ఆదివారం భక్తులు నిమజ్జనానికి తరలించారు. మేళతాళాలు, డీజే, భాణాచంచా కాల్చుకుంటూ రంగులు చల్లుకుంటూ యువత చిందులు వేసుకుంటూ గణేష్ మహరాజ్‌కీ జై అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగిన గ్రామోత్సవాలు కనువిందు చేశాయి. కలుగోళశాంభవి ఆలయ ప్రాంగణంలో విగ్రహ నిమజ్జనోత్సవం సోమవారానికి వాయిదా పడింది. ముసునూరు గిరిజన కాలనీ వినాయక విగ్రహం మందాటి చెరువులో నిమజ్జనం చేశారు. గిరిజనుల పిల్లలు, పెద్దలు వేడుకలో పాల్గొన్నారు.

**పూజల్లో ఎమ్మెల్యే ఇంటూరి..**

కందుకూరు, గోకరాజుపాలెం, తానికొండ వినాయకుడికి నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నప్రసాదాలను భక్తులకు స్వయంగా వడ్డించారు బంగారమ్మ గుడి వద్ద ఆదివారం వివిధరకాల పోటీలు, ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఉట్టి కొట్టిన గుండవరపు సాత్విక్‌ను స్థానికులు అభినందించి రూ. 1,116లను అందజేశారు.

## పోలేరమ్మకు పొంగళ్లు

**ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 15:** మండలంలోని కుర్రపల్లి బీసీ కాలనీ వాసులు ఆదివారం గ్రామదేవత పోలేరమ్మకు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పొంగించారు. ఈ సందర్భంగా పొంగళ్ల సామగ్రిని నూతన బుట్టల్లో ఉంచుకొని కాలనీ పురువీధుల్లో మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యంతో పాటు కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకొన్నారు.



ఆలయ అవరణలో పొంగళ్లు నిర్వహిస్తున్న భక్తులు

## యువ ఇంజనీర్లకు స్ఫూర్తి ప్రదాత మోక్షగుండం



నివాళులర్పిస్తున్న సుధీర్‌నాయుడు, విద్యార్థులు

**కావలి టౌన్, సెప్టెంబరు 15:** యువ ఇంజనీర్లకు స్ఫూర్తి ప్రదాత మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు తెలిపారు. ఆదివారం మద్దూరుపాడు డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఇంజనీర్స్ డే వేడుకలో మోక్షగుండం విశ్వే శ్వరయ్య విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏవో రమేష్, హరనాథ్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సొసైటీ మహా జనసభ

**కలువాయి, సెప్టెంబరు 15:** స్థానిక మత్స్యకారుల సహకార సంఘం మహా జనసభ గురువారం ఉదయం 11గంటలకు అంకమ్మ రచ్చ వద్ద నిర్వహించనున్నట్లు కావలి మత్స్యశాఖ సహాయ సంచాలకులు, ఎక్స్ అఫీషియో డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కో ఆపరేటివ్ యస్.శ్రీనివాసులు తెలిపారు. సొసైటీ పరిధిలోని కలువాయి, రామన్నగారిపల్లె, బ్రాహ్మణపల్లి, బద్వేలు, సీతారాంపల్లి గ్రామాల సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

## నేత్రదానానికి 25మంది రిజిస్ట్రేషన్



నేత్రదాన శిబిరంలో పాల్గొన్న రెడ్‌క్రాస్ సభ్యులు

**కలువాయి, సెప్టెంబరు 15:** రెడ్‌క్రాస్ సొసైటీ కలువాయి బ్రాంచ్ ఛైర్మన్ పెంచలపుల్లయ్య ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన నేత్రదాన శిబిరంలో 25 మంది యువత తమ నేత్రాలను దానం చేసేందుకు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. నేత్రదానానికి ముందుకు వచ్చిన వారికి రెడ్‌క్రాస్ తరుపున అభి నందనలు తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కంటి వైద్యనిపుణులు పి.శైలజ పాల్గొని వారికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కలువాయి బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ కామిశెట్టి వెంకటేశ్వర్లు, రాంబాబు, మల్లికార్జునయ్య, చిన్నయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## బీజేపీ సభ్యత్వ నమోదు



ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు చేస్తున్న బీజేపీ నాయకులు

**దుత్తలూరు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 15:** దుత్తలూరు మండలం నర్రవాడ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం బీజేపీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలతో ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారన్నారు. సభ్యత్వాల నమోదులో జిల్లాను మొదటిస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు, సభ్యత్వ ప్రముఖ్ అందే రామయ్య, నాయకులు లెక్కల వెంకటరెడ్డి, కృష్ణయ్య, వెంకటేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరి జట్టుకు అభినందన



క్రికెట్‌లో విజయం సాధించిన ఉదయగిరి యూటీఎఫ్ జట్టు

**ఉదయగిరిరూరల్, సెప్టెంబరు 15:** యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా ఉపాధ్యాయులకు నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఆటల పోటీల్లో ఉదయగిరి యూటీఎఫ్ జట్టు క్రికెట్, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటి జిల్లాస్థాయిలో విజయం సాధించింది. క్రికెట్, వాలీబాల్ పోటీల్లో పది జట్లతో తలపడి ప్రథమస్థానంలో నిలిచిన జట్టుకు మండల యూటీఎఫ్ శాఖ శుభాకాంక్షలు తెయచేశారు.

## ప్రమాదకరంగా చప్టాలు

**కలిగిరి, సెప్టెంబరు 15:** కలిగిరి-సంగం మార్గంలో కమ్మవారిపాలెం, పాతనాపురం, అక్బరాబాదు, కలిగిరి-కొండాపురం మార్గంలో కలిగిరి శివారు ప్రాంతం, కుడుములదిన్నెపాడు, చినఅన్నలూరు, సిద్దనకొండూరు మార్గంలో పరికోట, సిద్దనకొండూరు, కుమ్మరకొండూరు, గంగిరె డ్డిపాలెం, తెల్లపాడు గ్రామాలవద్ద ఉన్న చప్టాల వద్ద రక్షణ గోడలు లేవు. దీంతో వర్షపునీరు ప్రవహించే సమయంలో ఈ మార్గంలో ప్రయాణికులు ప్రమాదాలబారిన పడుతున్నారు. చప్టాల అంచున వరద ప్రవాహాన్ని అంచనా వేసేందుకు కనీసం ఇనుప కడ్డీలు కూడా లేవు. భారీ వర్షాల సమయంలో సిద్దనకొండూరు-14వ మైలు మార్గంలో పరికోట సమీపంలో వాగు ప్రవాహంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపో తున్నాయి. రెండేళ్ల క్రితం సిద్దనకొండూరు, అనంతపురం గ్రామాల నుంచి ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కావలికి బయలుదేరి ఈ వాగు వద్ద నిలిచిపోయారు. స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు తహసీల్దారుకు సమాచారం అందించగా ఆయన ఈ విషయాన్ని కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ సమయంలో ప్రత్యేక రక్షణ చర్యలు ఏర్పాటు చేసి విద్యార్థులను సురక్షితంగా వాగు దాటించారు. కాగా తక్కువ ఎత్తు ఉన్న వంతెనల వద్ద చప్టాలను నిర్మించి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.





# వరద బాధితులకు రూ.1.25 లక్షల విరాళం

హెల్పింగ్ హ్యాండ్స్

**కందుకూరు, సెప్టెంబరు 15:** నియోజకవర్గ సీనియర్ టీడీపీ నాయకులు వరద బాధితుల సహాయార్థం రూ.1.25 లక్షలు విరాళం అందజేశారు. పార్టీ ముఖ్య నాయకులు కలిసి ఈ మొత్తాన్ని ఆదివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు అందజేశారు. విరాళం అందజేసిన వారిలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల అధ్యక్షుడు నార్నె రోశయ్య, గుడ్లూరు మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, లింగసముద్రం మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు, వివిపాలెం మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, ఉలవపాడు మండల అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు, కృష్ణాపురం టీడీపీ అధ్యక్షుడు చక్రవర్తుల విజయ్‌కుమార్, పట్టణ టీడీపీ ఉపాధ్యక్షుడు వడ్డెళ్ల రవిచంద్ర ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడారు. విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు నియోజకవర్గ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విరాళాలు అందజేస్తుండటం అభినందనీయమన్నారు.



కొండాపురం: వాహనంలో ఉంచిన సరుకులతో యువత



కొండాపురం: కాకర్లకు చెక్కును అందచేస్తున్న జాగర్లమూడి శ్రీనివాసరావు

**కొండాపురం:** తెలుగుయువత మండల మాజీ అధ్యక్షుడు జాగర్లమూడి శ్రీనివాసరావు రూ.20వేల చెక్కును ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు ఉదయగిరి క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

**సాయపేటలో యువత ఆధ్వర్యంలో..**

కొత్తపాలెం, మక్కెనవారిపాలెం, వెల్లటూరివారిపాలెం, ఇస్కపాలెం గ్రామాల్లో విరాళాలు సేకరించారు. వస్తువులు, బియ్యం, నిత్యావసరాలు ధనరూపంలో విరాళాలు సేకరించినట్లు సామాజిక కార్యకర్త భీమిరెడ్డి అరుణ తెలిపారు. 250మంది కుటుంబాలకు సరుకులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గంటా శ్రీనివాసులు, షేక్ మహబూబ్ బాషా, వల్లూరు వెంకటేశ్వర్లు, తాటికొండ ప్రవీణ్, పొడపాటి కొండయ్య, మందా నాగేశ్వరరావు పాల్గొన్నారు.



కందుకూరు: ఎమ్మెల్యే ఇంటూరికి విరాళం అందజేస్తున్న టీడీపీ నాయకులు

**జలదంకి** : విజయవాడ వరదబాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు మండలం ఐటీడీపీ అధ్యక్షుడు ఏగూరి రఘు రూ.20వేల చెక్కును ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు అందజేశారు.

# సమస్యల పరిష్కారానికే పంచాయతీ ప్రజాదర్బార్

- ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

**జలదంకి, సెప్టెంబర్ 15:** ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదివారం జమ్మలపాలెం గ్రామ సచివాలయంలో పంచాయతీ ప్రజాదర్బార్ నిర్వహించారు. 500మందికిపైగా స్థానికులు కార్యక్రమంలో పాల్గొని వివిధ సమస్యలపై అర్జీలు అందజేశారు. వీటిపై అక్కడే ఉన్న మండల అధికారులతో చర్చించడంతో అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. జలదంకిలో సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వలు, తాగు, సాగునీటి సమస్యలపై ప్రజలు వినతులు అందజేశారు.

- పేదల నుంచి నుడా ఎంబీజీ లేఅవుట్లకు సేకరించిన భూమికి సంబంధించి 26మందికి నష్టపరిహారం నేటికీ అందలేదని మాజీసర్పంచ్ నక్కా మాధవరావు ఫిర్యాదు చేశారు. తహసీల్దారు హేమంత్‌కుమార్‌ను పిలిచి వెంటనే వీరికి నష్టపరిహారం అందజేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు.
- తన కుమారుడు విద్యుత్‌షాక్‌తో మరణిస్తే ప్రభుత్వ నష్టపరిహారం అందలేదని బాధిత మహిళ ఎమ్మెల్యే ఎదుట తన గోడు వెళ్లబోసుకుంది. అక్కడే ఉన్న సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్‌ను పిలిచి వివరాలు అడిగారు. ఎన్నికల కోడ్ ఉన్నందున రూ.5లక్షల పరిహారం చెక్కు ఆగిం దన్నారు. పరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.
- ఉదయం 9గంటలకు ప్రారంభమైన ప్రజాదర్బార్ సాయంత్రం 4గంటలు కొనసాగింది. ప్రజాదర్బార్‌కు వచ్చిన ఎమ్మెల్యేను సర్పంచ్ బుర్రి శ్రీవేణి సన్మానించారు.
- అనంతరం ఎమ్మెల్యే కాకర్ల విలేకరులతో మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పంచాయతీ ప్రజాదర్బార్ కార్యక్రమంను మొదటగా జమ్మలపాలెంలో చేపట్టామన్నారు. తాగునీటి సమస్యపై అధిక వినతులు వచ్చాయన్నారు. సోమశిల జలాలు చెరువుకు వచ్చేందుకు కాలువ నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బుర్రి శ్రీవేణి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య, తహసీల్దారు హేమంత్‌కుమార్, ఎంపీడీఓ, టీడీపీ మండలాధ్యక్షుడు మధుమోహన్‌రెడ్డి, జయచంద్రారెడ్డి భాస్కర్‌రెడ్డి, మాల్యాద్రియాదవ్, తల్లపనేని మధుసూదనరావు, నక్కా మాధవరావు పాల్గొన్నారు.



అర్జీదారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

## పనిచేసిన వారిని
## విస్మరించడం విచారకరం: మాలేపాటి

**కావలి, సెప్టెంబరు 15:** పట్టణంలో కష్టకాలంలో టీడీపీ కోసం పనిచేసిన వారిని విస్మరించడం విచారకరం అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. ఆదివారం కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ కోసం పనిచేసిన వారికి కావలిలో తగిన గుర్తింపు ఇవ్వటం లేదని వైసీపీ వారిని చేర్చుకుని వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని ఈ విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళతామన్నారు. కావలిలో పార్టీ పటిష్టతకు ఎన్నో పోరాటాలు చేశామని ఆ సమయంలో 16కేసులు పెట్టినా ఎక్కడా వెనక్కు తగ్గలేదన్నారు. చంద్రబాబు నాయుడు జైల్లో ఉన్న సమయంలో దగదర్తిలో కొందరు వైసీపీ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్న వారికి ఇప్పుడు టీడీపీ దగ్గరకు చేర్చుకుని వారికి ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో టీడీపీ అభ్యర్థి క్రిష్ణారెడ్డి దగదర్తిలో మాలేపాటి బ్రదర్స్‌కు తెలియకుండా ఏ కార్యక్రమం చేపట్టమని చెప్పి ఇప్పుడు విస్మరించారన్నారు. నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల సమయంలో పార్టీ నుంచి సస్పెండ్ చేసిన పమిడి రవికుమార్ చౌదరి దగదర్తిలో పెత్తనం చెలాయించటం ఏమిటన్ని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో తాము పార్టీకోసం సక్రమంగా పనిచేయలేదని చేస్తున్న ఆరోపణలను ఒక్కటి రుజువు చేయాలని సవాల్ విసిరారు. ఈ విషయంపై త్వరలో చంద్రబాబు నాయుడిని కలిసి ఇక్కడ పరిస్థితులు వివరించి ఆయన ఆదేశాల మేరకు నడుచుకుంటామన్నారు.

# నెల్లూరు సిటీ, రూరల్
# కోవూరు, సర్వేపల్లి





మొక్కలు నాటుతున్న జనతా ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థినులు

## గురుకులంలో మొక్కలు నాటిన ఎన్‌సీసీ క్యాడెట్లు

వెంకటాచలం, సెప్టెంబరు 15 : మండలంలోని గొలగమూడిలోని బీసీ గురుకుల పాఠశాలలో జనతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. నాటిన మొక్కలను బాధ్యతగా తీసుకొని సంరక్షించడం తమ బాధ్యత అని జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దాసరి ప్రసాద్ గౌడ్ తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వరప్రసాద్, వీఎస్‌యూ సోషల్ వర్క్ విభాగం అధ్యాపకుడు డాక్టర్ బీ వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యాయుడు సుమవల్లి, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పొణకా కనకమ్మకు ఘన నివాళి



ఇందుకూరుపేట, సెప్టెంబరు 15 : ప్రముఖ స్వాతంత్ర్య పోరాట యోధురాలు, ఆశ్రమ స్థల దాత పొణకా కనకమ్మ వర్ధంతి సందర్భంగా ఆదివారం మండలంలోని పల్లిపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో పొణక కనకమ్మ విగ్రహానికి గురుకులం ఉపాధ్యాయిని చింతపంటి జ్యోతి పట్టు వస్త్రాలు, పూలమాలలు సమర్పించి ఘన నివాళులర్పించారు. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహానికి ఆశ్రమ కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, గణేశం దయాకర్‌రెడ్డి, దువ్వూరు రామ్మోహన్‌రెడ్డి, ఆశ్రమ కమిటీ సభ్యురాలు గంపల మంజుల నూలు మాలలు, ఖాదీమాల సమర్పించారు. ఈ సందర్భంగా పొణక కనకమ్మ సేవలను పలువురు కొనియాడారు. ఆశ్రమ కన్వీనర్ గణేశం కల్పనమ్మ భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ శిక్షకులు, శిక్షణార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పోరాటయోధుడు ఏచూరికి ఘన నివాళి



సీతారాం ఏచూరి చిత్రపటం ఎదుట నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కోవూరు, సెప్టెంబరు 15: ఇటీవల మృతి చెందిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి చిత్రపటాన్ని ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందరగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జొన్నలగడ్డ వెంకమరాజు మాట్లాడుతూ సీతారామ్ ఏచూరి మరణం వామపక్ష ఉద్యమానికి తీరనిలోటని చెప్పారు. పార్లమెంటులో ప్రజా సమస్యల్ని ప్రస్తావించడంలో ఆయన చూపిన చొరవ అద్వితీయమన్నారు. రాజకీయాల్లో మహోన్నత వ్యక్తిత్వాన్ని చాటి చెప్పారని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, సీపీఎం నాయకులు గండవరపు శేషయ్య, విజయకుమార్, బుజ్జయ్య, మారుబోయిన సుబ్బారావు, సీనియర్ న్యాయవాది జక్కా శేషమ్మ, యూటీఎఫ్ నాయకులు ఖాజావలి, సీహెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రవర్తన మార్చుకోవాలి



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్

కోవూరు, సెప్టెంబరు 15: పలు కేసుల్లో నిందితులుగా కొనసాగుతూ అక్రమాలకు పాల్పడుతున్న పలువురు యువకులకు ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆదివారం రౌడీషీటర్లందర్నీ పోలీసుస్టేషన్‌కు పిలిపించి ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం సొంత పూచికత్తుపై వారిని పంపించారు.

## ఉపాధ్యాయులకు ఉద్యోగ విరమణ సన్మానం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న నేతలు

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 15 : ఉపాధ్యాయులుగా పనిచేస్తూ పీఆర్‌టీయూలో సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన వారిని ఆదివారం పీఆర్‌టీయూ జిల్లా కార్యాలయంలో సన్మానించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి నాటకం తిరుమలయ్య మాట్లాడుతూ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీ వెంకటరాజు, నేతలు ఎస్‌కే రఫీ, జీ సైమన్‌కుమార్, ఎల్ సుబ్బారావును సత్కరించినట్లు చెప్పారు. వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు ఎస్ నాగేంద్రకుమార్, జిల్లా నేతలు శ్రీనివాసులు, రవిచంద్ర, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటేశ్వర్లు నాయుడు, మునిరాజాచార్యులు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం నాయకులు

# వరద బాధితులకు చేయూత



నిత్యావసరాలు అందజేస్తున్న నూర్‌బాషా సంఘం నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 15 : విజయ వాడ వరద బాధితులకు నెల్లూరులోని నగరంలోని పలువురు చేయూతనిచ్చి దాతృత్వాన్ని చాటుకున్నారు.

● విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ భవనంలో అఖిల భారత గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 400 మంది గాండ్ల, తెలికుల వరద బాధితు లకు దుప్పట్లు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నెల్లూరుకు చెందిన గ్రేసు సుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వర రావు హాజరయ్యారు. వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం కులాలు, మతాలకు అతీతంగా సాయం చేస్తోందని చెప్పారు. గాండ్ల, తెలికుల సంఘాలను ఆదర్శంగా తీసుకుని మిగిలిన కుల సంఘాలు కూడా వరద బాధితులకు సాయం అందించాలని కోరారు. తమ కులం వారికి విద్యాపరంగా, సామాజిక, రాజకీయంగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సహకారం అందించాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా మధుసూదన్ రావు, జిల్లా అధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనివాసరావులు ఎమ్మెల్యే ఉమాను కోరారు.

● నెల్లూరుజిల్లా నూర్‌బాషా సంఘం యువజన విభాగం ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో వరద బాధితులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు, టవళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు షేక్ సుభాన్‌బాషా, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ హన్నాబాయ్, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. విజయవాడలోని గొల్లపూడి, రామరాజ్యనగర్, కృష్ణలంక తదితర ప్రాంతాల్లో వరద సాయం అందజేశారు.



● విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆదివారం జిల్లా కలెక్టర్ ఆనంద్‌కి జాలీ వాకర్స్ అసోసియేషన్ రూ.50వేలకు డీడీ అందజేసింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఎన్ రాజశేఖర్, కార్యదర్శి పీ శ్రీరాములు, సభ్యుడు బాలాజీ పాల్గొన్నారు.

విడవలూరు, సెప్టెంబరు 15 : విజయవాడలో వరదలకు ఇబ్బందులు పడుతున్న బాధితులను నూర్‌భాషా సంక్షేమ సంఘం యువజన విభాగం, మండల కో ఆప్షన్ సభ్యులు ఎస్‌కె.రఫీ ఆధ్వర్యంలో చేయూతనిచ్చారు. ఆదివారం విజయవాడ నగర పరిధిలో గొల్లపూడి పంచాయతీ, రామరాజపురం, కృష్ణలంక లలో పర్యటించి బాధితులకు దుప్పట్లు, బియ్యం, కూరగాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నూర్‌భాషా సంక్షేమ సం ఘం రాష్ట్ర అధికార ప్రతినిధి హన్నుబాయ్, జిల్లా యువత అధ్యక్షుడు షేక్.సుభాన్, నగర యువత అధ్యక్షుడు షేక్.లతీఫ్, జిల్లా యువత ప్రధాన కార్యదర్శి షేక్.అల్తాఫ్, షేక్.హజరత్‌అలి, బాలాజీ, పాల్గొన్నారు.

## పేదలకు 'నారా లోకేష్ ఆరోగ్య రక్ష'

● 22న వేదగిరి క్షేత్రంలో ప్రారంభం : కోటంరెడ్డి సోదరులు




ఆరోగ్య రక్ష లోగోను ఆవిష్కరిస్తున్న కోటంరెడ్డి సోదరులు

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 15 : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించేందుకు నారా లోకేష్ ఆరోగ్య రక్ష పథకాన్ని అమల్లోకి తీసుకువస్తున్నట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడు తూ ఆరోగ్య పథకాన్ని ఈ నెల 22న వేదగిరి క్షేత్రంలో ప్రారంభిస్తామని చెప్పారు. పేదలు వారి అనారోగ్య పరిస్థితిని తెలియచేస్తే కార్పొరేట్ ఆసుపత్రుల్లో ప్రముఖ వైద్యులతో పరీక్షలు నిర్వహించిన వారి సూచనలతో తదుపరి వైద్యం అందిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా కేన్సర్ స్క్రీనింగ్ కూడా ఉచితంగా నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యరక్ష కన్వీనర్ దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

**టీడీపీలోకి పిండి**

నగరంలోని 36వ డివిజన్ కార్పొరేటర్ పిండి శాంతి, ఆమె భర్త వైసీపీ డివిజన్ ఇన్‌చార్జి పిండి సురేష్ ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనుచరగణంతో ర్యాలీగా రూరల్ ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. సురేష్ రాకతో తనకు రాజకీయ బలం పెరిగిందని ఎమ్మెల్యే తెలిపారు.

## గోడను ఢీకొట్టిన ట్రాక్టర్

నెల్లూరురూరల్, సెప్టెంబరు 15 : నెల్లూరు రూరల్ మండలం కలివెలపాళెం గ్రామంలో ఆదివారం ఓ ట్రాక్టర్ రోడ్డు పక్కనున్న గోడను ఢీకొట్టింది. ఈ ఘటన లో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. గ్రామంలో ఎన్టీఆర్ మలుపు వద్ద ట్రాక్టర్ వస్తుండగా, ఎదు రుగా మరో వాహనం రావడంతో దానిని తప్పించే క్రమంలో అదుపు తప్పి గోడను ఢీకొంది.

## విశ్రాంత ఇంజనీర్లకు సన్మానం

నెల్లూరు (సాంస్కృతికం) : ఇంజనీర్స్ డే సందర్భంగా జిల్లాలోని విశ్రాంత ఇంజనీర్లకు ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానం జరిగింది. బీవీనగర్‌లోని పెన్షనర్స్ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎం బాషా, ప్రధాన కార్యదర్శి ఎస్‌వీవీఎన్ మూర్తి, టీమ్ లీడర్ కామయ్య, ఉపాధ్యక్షుడు గురునాథం, విశ్రాంత ఈఈ రామిరెడ్డి, విశ్రాంత డిప్యూటీ ఇంజనీర్ నజీర్‌బాషా, బాబిరెడ్డి, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

● ఇంజనీర్ లలితా రామ్‌ను ఆదివారం మురిగిపూడి ట్రస్ట్ తరపున ఎం సతీష్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఆయన దేశ విదేశాల్లో ప్రతిభ చాటుతూ జిల్లాకు గుర్తింపు తీసుకొస్తున్నారని కొనియాడారు.

## ప్రతిభతోనే ఉన్నతి

కొడవలూరు, సెప్టెంబరు 15: మంచి ప్రతిభతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని శ్రీవెంకటేశ్వర విద్యాసంస్థల చైర్మన్ వీ.గుణశేఖర్ అన్నారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో భారతరత్న డాక్టర్ విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఇంజనీరింగ్ డే ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## 'శ్రీమద్ సుందరకాండము' ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 15 : ప్రముఖ రచయిత సీహెచ్‌వీ బృందావనరావు రచించిన శ్రీమద్ సుందరకాండము తెలుగు పద్య కృతి ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం పురమందిరంలో ఘనంగా జరిగింది. పద్య కళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన ప్రముఖ విద్వాంసుడు, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ సూరం శ్రీనివాసులు మాట్లాడుతూ దాదాపుగా 15వేల పద్యాలతో సుందరకాండమును అత్యంత రమణీయంగా తీర్చిదిద్దిన బృందావనరావు పాండిత్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వర రావు, ఆగస్త్యరాజు సుబ్బారావు, ఎస్ఎస్ ఆర్కే ప్రసాద్‌రావు, శతావధాని కొండపు మురళీకృష్ణ, ఈతకోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రముఖ కథకులు కాట్రగడ్డ దయానంద్, కందిమల్ల శివప్రసాద్, సాహితీవేత్తలు కలిసి రచయితను సత్కరించారు.

## రాజా గౌతమ్‌కు ఉత్తమ ఇంజనీర్ అవార్డు



ఉత్తమ ఇంజనీర్ అవార్డు అందుకుంటున్న రాజాగౌతమ్

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 15 : మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి, ఇంజనీర్స్‌డే సందర్భంగా 2024 సంవత్సరానికి ఉత్తమ ఇంజనీర్‌గా నెల్లూరుకు చెందిన రాజాగౌతమ్ అవార్డు అందుకున్నారు. ఆధునిక నిర్మాణ రంగంలో సాంకేతిక సూచనలు అనే అంశంలో ఆయనకు ఈ అవార్డు లభించింది. ఆదివారం తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో ఐఐటీ తిరుపతి సివిల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ ఏ మురళీకృష్ణ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాజాగౌతమ్ స్పందిస్తూ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ బీఎస్ రాజు, బుద్దా ప్రాజెక్టు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## పాస్టర్ల సంఘం అధ్యక్షుడిగా గురుస్వామి



పాస్టర్ల సంఘం నూతన కమిటీ

మనుబోలు, సెప్టెంబరు 15 మండల పాస్టర్ల సంఘం అధ్యక్షు డుగా స్వామిజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పాస్టర్ల వెల్ఫేర్ సంఘం జాతీయ అధ్యక్షుడు గడ్డం హనోక్ ఆదివారం ప్రకటించారు. స్థానిక లాజరస్ చర్చిలో మండలంలోని పలు గ్రామాల చర్చిల పాస్టర్లు సమావేశమయ్యారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా పుట్టా గురుస్వామి, ఉపాధ్యక్షుడుగా ఈగ మనోహర్, ప్రధాన కార్యదర్శి అల్లూరు మధుసూదన్‌రావు, సహాయకార్యదర్శి అల్లం లాజరస్, కోశాధికారి జూపల్లి చైతన్యలతో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఏ.రమేష్, కార్యవర్గ సభ్యులు సునీల్, తిరుపతి జిల్లా కన్వీనర్ జె. కిషోర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మకు నెల పొంగళ్లు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

పొదలకూరు, సెప్టెంబరు 15 : పట్టణంలోని శివాలయం వీధిలో వెలిసి ఉన్న శక్తి స్వరూ పిణి గంగమ్మకు నెల పొంగళ్లు, కొలుపు వేడుకను ఆదివారం యాదవులు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆనవాయితీగా అమ్మవారికి ముగ్గు దిష్టి తీర్పు చేపట్టారు. అనంతరం మహిళ భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద గొల్ల మద్దిరిళ్ల నరసింహులు యాదవ్, గోమసాని వేణుయాదవ్, లాలి వెంకటేశ్వర్లు, పీపీఎస్ ప్రసాద్‌యాదవ్, యరగర్ల జయరామయ్య, గోళ్ల పద్మనాభం, ప్రసాద్‌యాదవ్, శివకుమార్, కుమార్, సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి దోపిడీపై విజిలెన్స్ విచారణ చేయించాలి

● జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి



మట్టి దోపిడీ జరిగిన కనుపూరు చెరువును పరిశీలిస్తున్న జనసేన నాయకులు

వెంకటాచలం, సెప్టెంబరు 15 : కనుపూరు చెరువు, సర్వేపల్లి రిజర్వాయర్‌లల్లో గత వైసీపీ పాలనలో జరిగిన మట్టి, గ్రావెల్ దోపిడీపై విజిలెన్స్ విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని కనుపూరు చెరువును ఆదివారం ఆయన జనసైనికులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రెండుసార్లు ఎమ్మెల్యేగా, వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి సర్వేపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా సర్వనాశనం చేశారని విమర్శించారు. కాకాణి అండ్ బ్యాచ్ కలిసి చెరువులు, రిజర్వాయర్, ప్రభుత్వ భూములు, కొండలనే లక్ష్యంగా చేసుకొని ఇష్టానురీతిలో గ్రావెల్, మట్టి దోపిడీకి పాల్పడి రూ.కోట్ల ప్రజాసంపదను దోచుకున్నారని ఆరోపించారు. మట్టి దోపిడి చేసిన కాకాణి అండ్ బ్యాచ్ కూడా తమపై అసత్య ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చిల్లర దొంగలు వైసీపీ నాయకులేనని, చిల్లర దొంగలకు ముఠా నాయకుడు కాకాణి అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో గుమ్మినేని వాణిభవాని, నాయకులు మల్లికార్జున్, శ్రీహరి, రవికుమార్, అఖిల్, విష్ణు, రహీమ్, రెహమాన్ తదితరులున్నారు.

## రాజకీయాలకు ప్రత్యామ్నాయం 'ఫార్వర్డ్ బ్లాక్'

నెల్లూరు (సాంస్కృతికం): నేతాజీ భావజాలం కలిగిన ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ దేశ ప్రస్తుత రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా ఎదుగుతోందని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పీవీ సుందరరామరాజు తెలిపారు. ఆదివారం నగరంలోని జీవీఎస్ కాంప్లెక్స్‌లో ఆ పార్టీ జిల్లా శాఖ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో పార్టీ సేవలు విస్తృతపరిచేందుకు కమిటీలు వేస్తున్నామని తెలిపారు. ఈ సభకు రాష్ట్ర అధ్యక్షుడు బీ సుభాష్‌చంద్రారెడ్డి అధ్యక్షత వహించారు. పార్టీ జిల్లా కన్వీనర్‌గా పాశం నరసింహారావు, కో కన్వీనర్‌గా పాడి లీలామోహన్‌తోపాటు 9 మందితో కమిటీని నియమించారు.



జిల్లా కన్వీనర్‌గా ఎంపికైన పాశం నరసింహారావును సత్కరిస్తున్న నాయకులు

# అట్టహాసంగా వినాయక నిమజ్జనం

విడవలూరు, సెప్టెంబరు 15 : మండల పరిధిలోని పార్లపల్లి పంచాయతీ గమళ్లపాలెంలో జనసేన, టీడీపీ, బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ఆదివారం నిమజ్జనం అట్టహాసంగా జరిగింది. ముందుగా స్వామివారికి సమర్పించిన లడ్డూ వేలం పాట నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, టీడీపీ నాయకులు వేమూరు చంద్రారెడ్డి, జనా గిరీష్, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**తోటపల్లిగూడూరు** : మండలంలోని కొత్తపాలెంలో ఆదివారం ఉట్టి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా పాల్గొని బాణాసంచా, తప్పెట్ల తాళాల నడుమ ఉట్టి కొట్టారు. అనంతరం బొజ్జ గణపయ్యకు గ్రామోత్సవం, లడ్డూ వేలం నిర్వహించారు. ఎస్‌ఐ వీరేంద్ర బాబు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**నెల్లూరు (సాంస్కృతికం)**: నగరంలోని వేదాయపాళెం సెంటర్‌లో వేదగణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మహాగణపతికి ఆదివారం రాత్రి వైభవంగా నిమజ్జనోత్సవం జరిగింది. ఇక్కడ సింహపురి గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. చివరిరోజు మహాగణపతిని ప్రత్యేకంగా అలంకరించి, మేళతాళాలు, తప్పెట్లు, బాణాసంచా వేడుకలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గణేష్ ఘాట్‌లో నిమజ్జనం చేశారు.



ఎక్సకవేటర్ సాయంతో టిప్పర్‌లో మట్టి పోస్తున్న దృశ్యం


చెరువులో నుంచి మట్టి తరలిస్తున్న ట్రాక్టర్


మట్టిని తరలిస్తున్న టిప్పర్ లారీ

## ఐదు ఇసుక లారీల పట్టివేత

ఏర్పేడు మండలం గోవిందవరం సబ్ స్టేషన్ సమీపంలో నిల్వ ఉంచిన ఇసుకను కొంతమంది లారీల ద్వారా తరలించడానికి ఆదివారం రాత్రి యత్నించారు. సమాచారం అందుకున్న వికృతమాత మాజీ సర్పంచ్ హేమాక్షిరాయల్ తన అనుచరులతో అక్కడికి చేరుకుని లారీలను అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం అందించి ఐదు లారీలను వారికి అప్పగించారు. తరలింపు వెనుక ఉన్న వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.




# యథేచ్ఛగా మట్టిదందా

● వైసీపీ తరహా దోపిడీ కొనసాగింపు

తిరుపతి/ఏర్పేడు, సెప్టెంబరు 15: ప్రభుత్వం మారినా వైసీపీ నాయకుల మట్టి దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నేషనల్ హైవే నిర్మాణానికి రేణిగుంట మండలం మల్లిమడుగు డ్యాం వెనుక భాగంలో గుట్టను తవ్వుకోవడానికి అప్పటి కలెక్టర్ అనుమతిచ్చారు. హైవే నిర్మాణం మాటున మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి,వైసీపీ మండల నాయకులు ఐదేళ్ల మట్టిని అక్రమంగా తరలించి కోట్లు సంపాదించుకున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వం మారి మూడు నెలలు కావస్తున్నా అదే స్థాయిలో దోపిడీ సాగుతోంది. ఏకంగా భారీ మిషనరీతో గుట్టను తవ్వేస్తున్నారు. సగానికి పైగా గుట్ట కరిగిపోయింది. ఈ మట్టిని ప్రైవేటు కాంట్రాక్టర్లకు, వెంచర్లకు లోడు టిప్పర్ లారీ రూ.20వేలకు విక్రయిస్తున్నారని సమాచారం. అలాగే ఏర్పేడు మండలంలోని కేంద్రీయ విద్యాసంస్థ ఐసర్ ప్రహరీకి ఆనుకుని ఉన్న చెరువులో మట్టిని తిరుపతికి చెందిన ఓ వ్యక్తి వెంచర్‌కు తరలిస్తున్నారు. జంగాలపల్లి పంచాయతీ శివగిరిపల్లి చెరువులో మట్టిని ఎక్స్‌కవేటర్ల సాయంతో టిప్పర్లు, ట్రాక్టర్లలో నింపి తరలించేస్తున్నారు. రెండు రోజులుగా ఈ దందా సాగుతోంది. రోజుకు సుమారు 200 టిప్పర్ల మట్టిని తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

# ఇక ఫ్రెండ్లీ ఎస్‌ఆర్వోలు

## కార్యాలయాల్లో రాచరికపు పోకడలు తొలగింపు

### ప్రజలకు చేరువగా సబ్ రిజిస్ట్రార్లు

తిరుపతి, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి) : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో (ఎస్‌ఆర్వో) రాచరికపు పోకడలకు స్వస్తి పలికేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం జిల్లాలో అమల్లోకి వచ్చింది. ఆదివారం సెలవు అయినప్పటికీ జిల్లాలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పోడియం, రాజదర్బార్ లాంటి కుర్చీలను తొలగించారు. పార్టీషన్ తీసేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్నట్టుగానే సబ్ రిజిస్ట్రార్ల కుర్చీ, టేబుల్‌తో పాటు కార్యాలయానికి వచ్చేవారు కూర్చునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భూముల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చేసే ప్రజలకు తగిన గౌరవం ఉండాలని కూటమి ప్రభుత్వం భావించింది. న్యాయస్థానాల్లో జడ్జిల తరహాలో సబ్ రిజిస్ట్రార్లు కూర్చొనే విధానానికి చెల్లుచీటి పలికింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యమైతే వారికి మంచినీరు, టీ ఆఫర్ చేసి గౌరవించాలని నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా ఉత్తర్వుల మేరకు వెంటనే పనులు ప్రారంభించామని జిల్లా రిజిస్ట్రార్ శ్రీరాములు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి చెప్పారు. జిల్లాలోని 16 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దాదాపుగా తొలగింపు పనులు పూర్తి చేశామన్నారు. సోమవారం ప్లాస్టింగ్ వంటి సివిల్ పనులు పూర్తి చేసుకుని, మంగళవారం నుంచి ఫ్రెండ్లీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు చూస్తారని చెప్పారు.



తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియంతో కూడిన ప్రత్యేక ఛాంబర్ - ఆదివారం వాటిని తొలగించిన దృశ్యం

వంట నూనెలపై దిగుమతి సుంకం పెంచినట్లు కేంద్రప్రభుత్వం ప్రకటించడమే తరువాయి. ధరలు అమాంతంగా పెరగడం ప్రారంభమయ్యాయి. శని, ఆదివారాలకే లీటరుపై రూ.15 నుంచి రూ.20 వరకు పెరిగాయి. వంట నూనె ధరల పెంపుతో గృహిణుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. కొత్త సరుకులపై కాకుండా నిల్వవున్న సరుకును కూడా అధిక ధరలకు విక్రయించడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఎక్కువ మంది ఉపయోగించే పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ ధరలు భారీగా పెరిగాయి. శని, ఆదివారాల్లో దుకాణాలకు వెళ్లిన వినియోగదారులకు రిక్తహస్తాలు ఎదురయ్యాయి. ఇదే అదునుగా కొందరు వ్యాపారులు నోస్టాక్ బోర్డును పెట్టి డిమాండ్ సృష్టిస్తున్నారు.
- తిరుపతి(నేరవిభాగం)/తడ / నాయుడుపేట




# వంటనూనెలు సలసల!

● లీటరుపై రూ.25వరకు ధర పెంపు

### గాడితప్పనున్న బడ్జెట్

సన్‌ఫ్లవర్ నూనె 15 లీటర్ల డబ్బా ఖరీదు శుక్రవారం వరకు రూ.1730. శని, ఆదివారాలకంతా రూ.2000కు చేరింది. లీటరు ప్యాకెట్ ధర రూ.108 నుంచి రూ.125-130కి ఎగబాకింది. అంటే లీటరుపై రూ.17 నుంచి రూ.23 వరకు పెరిగింది. 15 లీటర్ల పామోలిన్ నూనె డబ్బా ధర మొన్నటి వరకు రూ.1530 ఉండగా, ఇప్పుడది రూ.1730 దాటింది. మొన్నటి వరకు లీటరు ధర రూ.95 ఉండగా, శనివారానికి రూ.115కు చేరగా లీటరుకు రూ.20 వరకు పెరిగింది. వంటనూనెలు లేకుండా ఆహారపదార్థాల తయారీని ఊహించలేము. ఇప్పుడా వంటనూనె ధరల పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతుల వంటింటి బడ్జెట్ ఒక్కసారిగా గాడితప్పే పరిస్థితి ఏర్పడింది. పూజలకు వినియోగించే వివిధ రకాల నూనెల ధరలు కూడా అమాంతం పెంచేశారు. మొన్నటి వరకు లీటరు ధర రూ.100 - 110 వరకు వుండగా, అవి ఇప్పుడు రూ.125-130కి చేరాయి.

### నెలకు రూ.4 కోట్ల అదనపు భారం

తిరుపతి జిల్లాలో ప్రజలపై నెలకు దాదాపు 26.50 లక్షల వంటనూనె ప్యాకెట్లు వినియోగిస్తున్నట్లు హోల్‌సేల్ డీలర్లు అంచనా వేశారు. ఒక్కసారిగా లీటరుపై కనిష్ఠంగా రూ.15-20 పెరిగినందున నెలకు రూ.4 కోట్ల వరకు అదనపు భారం పడనుంది. దసరా, దీపావళి వంటి ముఖ్య పండుగలు వరుసగా ఉన్న నేపథ్యంలో నూనె వాడకం భారీగా పెరుగుతుంది.

### కల్తీకి రెక్కలు

మార్కెట్‌లో వంటనూనె విడి విక్రయాల పేరుతో కల్తీకి అవకాశముంది. రోడ్డు పక్కన ఉండే టిఫిన్ సెంటర్లు, చిన్న హోటళ్ళు, మాంసాహార భోజనం తయారీ దారులు ఎక్కువగా విడి నూనెనే కొనుగోలు చేస్తుంటారు. ఈ విడి విక్రయాలను అడ్డం పెట్టుకుని కొంత మంది కల్తీలు విక్రయించే అవకాశాలున్నాయి.

### బ్లాక్ మార్కెట్‌కు తరలింపు

కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచనుందన్న సమాచారంతో మిల్లుల యజమానులు, వ్యాపారులు వంట నూనెలను బ్లాక్ మార్కెట్‌కు తరలించేశారు. రెండ్రోజుల క్రితం డబ్బులు చెల్లించుకుని శనివారం డెలివరీ ఇవ్వాల్సిన ట్యాంకర్లకు సంబంధించి మొత్తాన్ని వ్యాపారులకు వ్యాపార సంస్థలు వెనక్కి ఇచ్చేశాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా డబ్బు చెల్లిస్తే సరఫరా చేస్తామని షరతు విధించాయి. దీంతో హోల్ సేల్, రీటైల్ వ్యాపారులు పెరిగిన ధరల ప్రకారమే విక్రయాలు ప్రారంభించారు. పామాయిల్, సన్‌ఫ్లవర్ అయిల్ మలేసియా నుంచి మన దేశానికి ఎక్కువగా దిగుమతి అవుతుంది. శని, ఆదివారాలు సెలవులతోపాటు సోమవారం మలేసియా మార్కెట్‌కు సెలవుదినం కావడంతో మంగళవారం వరకు ఆ ధరల పెరుగుదలపై స్పష్టత వచ్చే ఆస్కారం లేదు. సుంకం 12.5 శాతం నుంచి 32.5 శాతానికి పెరిగే అవకాశముందని తెలుస్తోంది.

# ఐదుగురు డీఎస్పీలకు పోస్టింగ్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 15: జిల్లాలో ఖాళీగా ఉన్న సబ్ డివిజన్లకు డీఎస్పీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. పల్నాడు మహిళా పోలీసు స్టేషన్‌లో డీఎస్పీగా పనిచేస్తున్న బి.ప్రసాద్‌ను చంద్రగిరికి, సీఐడీ విభాగంలో పనిచేస్తున్న ఏనుగంటి శ్రీనివాసరావును రేణిగుంటకు, ఏసీబీలో పనిచేస్తున్న వి.గిరిధర్‌ను తిరుపతి స్పెషల్ బ్రాంచ్‌కు, వీఆర్‌లో ఉన్న డి.మురళీధర్‌ను తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్సుకు, రాజగోపాల్ రెడ్డిని తిరుపతి పీటీసీకి నియమించింది.

# కలెక్టరేట్‌లో నేటి పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 15: తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం రద్దయింది. మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా సోమవారం ప్రభుత్వ సెలవుదినం కావడంతో పీజీఆర్ఎస్‌ను రద్దు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమం కూడా రద్దయినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు.

# కన్నులపండువగా కల్యాణం

● వరసిద్ధుడికి టీటీడీ తరపున పట్టు వస్త్రాలు



ఐరాల(కాణిపాకం),సెప్టెంబరు15: కాణిపాక క్షేత్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి వినాయకస్వామి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. రథోత్సవం మరుసటి రోజున తన మానస పుత్రికలైన సిద్ధి,బుద్ధిలతో పెళ్లిపెద్దగా బ్రహ్మ వ్యవహరించి వినాయకస్వామికి వివాహం జరిపిస్తారని భక్తుల నమ్మకం. ఉదయం ఉభయదారులైన కాణిపాకం, తిరువణంపల్లెలకు చెందిన వణిగ వంశస్థుల ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. అనంతరం కాణిపాక పుర వీధుల్లో కలశాలతో పాలను తీసుకొని ఊరేగించారు. అలంకార మండపంలో సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవర్లకు పాలాభిషేకం నిర్వహించారు.కల్యాణోత్సవ సందర్భంగా టీటీడీ తరపున ఈవో శ్యామలరావు వరసిద్ధుడికి పట్టు వస్త్రాలను అందజేశారు. రాత్రి అలంకార మండపంలో ప్రత్యేక కల్యాణ మండప వేదికపైకి వధూవరులను తీసుకొచ్చి మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా స్వామి వివాహం జరిపించారు.



### అమ్మవారి పవిత్రోత్సవాలకు
# అంకురార్పణ

తిరుచానూరు, సెప్టెంబరు 15: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి పవిత్రోత్సవాలకు ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ గావించారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఆదివారం ఉత్సవాలకు విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ గావించారు. అంతకు ముందు ఫ్రైడే గార్డెన్ నుంచి అర్చకులు పుట్టమట్టిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. సోమవారం పవిత్ర ప్రతిష్ఠ, మంగళవారం పవిత్ర సమర్పణ, బుధవారం పూర్ణాహుతితో ఉత్సవాలు ముగియనున్నాయి. భక్తులు ఒక్కొక్కరు రూ.750చెల్లించి ఒకరోజు పవిత్రోత్సవాల ఆర్జితసేవలో పాల్గొనవచ్చు. 2లడ్డూలు, 2వడలు బహుమానంగా అందిస్తారు. ఆలయంలో ఆర్జిత సేవలు టీటీడీ రద్దు చేసింది.


పుట్టమట్టిని సేకరిస్తున్న అర్చకులు

# శివయ్యా... ఇదేందయ్యా!

## ప్రదోష క్షేత్రంలో వైసీపీ నేత కుమార్తె నిశ్చితార్థ వేడుక

### కుర్చీలు వేసి మరీ ఆహ్వానితులను కూర్చోబెట్టడంపై విమర్శలు


ప్రదోష క్షేత్రం వద్ద కుర్చీల్లో కూర్చున్న బాలాజీ రెడ్డి బంధుమిత్రులు

నాగలాపురం, సెప్టెంబరు 15 : నాగలాపురం మండలంలో ప్రసిద్ధిగాంచిన సురుటుపల్లె పల్లికొండేశ్వర ఆలయంలో ఆదివారం ఆలయ మాజీ చైర్మన్,వైసీపీ నాయకుడు బాలాజీ రెడ్డి కుమార్తె నిశ్చితార్థ వేడుక జరిగింది.భక్తులు పవిత్రంగా భావించే ప్రదోష క్షేత్రం వద్ద ఎంతటి వారైనా నందీశ్వరుడి ఎదుట నేలపై కూర్చుంటారు. అయితే నిశ్చితార్థ కార్యక్రమానికి వచ్చిన బంధుమిత్రులను, రాజకీయ ప్రముఖులను స్వామివారి సన్నిధి ఎదుట వందకు పైగా కుర్చీలు వేసి కూర్చోబెట్టి కార్యక్రమాన్ని ఎంతో ఆర్భాటంగా చేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఆలయంలోని ప్రదోష క్షేత్రంలో పదిహేను రోజులకొకసారి వైభవంగా ప్రదోష పూజలను నిర్వహిస్తారు.ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చే వీవీఐపీలు, రాజకీయ ప్రముఖులు పాల్గొని గంటల కొద్దీ స్వామి వారి ఎదుట నేలపై కూర్చుంటారు.సాధారణంగా ఈ ఆలయంలో శుభ కార్యక్రమాలను ఆలయ ఆవరణలోని దేవస్థాన మండపంలో నిర్వహిస్తారు. ఒక వేల చిన్న పాటి శుభ కార్యక్రమాలను ప్రదోష క్షేత్రంలో నిర్వహించినా.. కార్యక్రమానికి వచ్చే వారు నేలపై కూర్చునేవారు. అయితే బాలాజీ రెడ్డి ప్రదోష క్షేత్రంలో కుర్చీలు వేసి మరీ ఆహ్వానితులను కూర్చోపెట్టడంపై భక్తులు మండి పడుతున్నారు.అంతే కాదు... పల్లికొండేశ్వరాలయంలో భక్తుల సౌకర్యార్థం దాతల సాయంతో నూతన వసతి గృహాలను ఏర్పాటు చేశారు.అయితే వీటిని ఇంతవరకూ ప్రారంభించక పోయినా.. నిశ్చితార్థ కార్యక్రమానికి వచ్చినవారి కోసం ఈ గదులను ఉపయోగించడం గమనార్హం.

# తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 15: పౌర్ణమి పర్వదినం పురస్కరించుకొని తిరువణ్ణామలైకి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామని సీటీఎస్ ఏటీఎం డి.రామచంద్రనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 4గంటల నుంచి ప్రత్యేక బస్సులు ప్రారంభమవుతాయన్నారు.బుధవారం వేకువజామున 3గంటల వరకు కొనసాగుతాయి. ప్రయాణికుల సౌకర్యార్థం రిజర్వేషన్ సౌకర్యంతో పాటు నేరుగా వచ్చినవారికి కూడా నాన్‌ఏసీ, ఏసీ బస్సులను అందుబాటులో ఉంచనున్నారు. ముందస్తు రిజర్వేషన్ ద్వారా రాకపోకలకు టిక్కెట్ బుకింగ్ చేసుకుంటే 10శాతం రాయితీ సదుపాయం కల్పించారు.

## నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్



బీడీ కాలనీలో స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

నాయుడుపేట, సెప్టెంబరు 15: నేరాలను నియంత్రించేందుకు కార్డెన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ చెంచుబాబు అన్నారు. నాయుడుపేట పట్టణంలోని బీడీ కాలనీలో ఆదివారం ఉదయం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన రికార్డులు లేని 20 మోటారు సైకిళ్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత గంజాయి, మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, గ్రామాల్లోకి అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ బాబి, ఎస్‌ఐలు అజయ్‌కుమార్, స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

## చెంగాళమ్మ సేవలో చాగంటి దంపతులు



చాగంటి దంపతులకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఈవో తదితరులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 15: చెంగాళమ్మ పరమేశ్వరిని ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు దంపతులు ఆదివారం దర్శించుకొన్నారు. ఆలయ ఇన్‌చార్జి ఈవో శ్రీనివాసబాబు చాగంటి దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మన్నారు పోలూరులోని అలఘు మల్లారి కృష్ణస్వామి ఆలయాన్ని చాగంటి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, మాజీ పాలక మండలి సభ్యులు ఐతా శ్రీధర్, ఎంఎం పద్మజ, కాకి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఆర్‌డీ సాయం అభినందనీయం



బాలకృష్ణకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం

గూడూరు, సెప్టెంబరు 15: నిరుపేదలు ఇంటిని నిర్మించేందుకు ఏపీఆర్‌డీ సంస్థ ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం గూడూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చిట్టమూరు మండలానికి చెందిన బాలకృష్ణ ఇంటి నిర్మాణం కోసం ఏపీఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో రూ.పది లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏపీఆర్‌డీ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలను గుర్తించి, ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.పది లక్షలు అందజేస్తుండడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర కో ఆర్డినేటర్ శిల్పాప్రియాంక, వాసంతి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా వరద బాధితుల సహాయార్థం సత్యంజీ గ్రూపునకు చెందిన ఆనంద్ రూ.లక్ష చెక్కును సీఎం సహాయనిధికి పంపేలా ఎమ్మెల్యేకు అందజేశారు. పట్టణంలోని ఆరో వార్డుకు చెందిన హరికృష్ణ, అతని మిత్ర బృందం రూ.25వేలు, గూడూరు ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ డాక్టర్ సురేష్ రూ.25వేలు చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు.

## విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కరుణాకర్‌రెడ్డి

గూడూరు, సెప్టెంబరు 15: విద్యార్థులు చిన్నతనం నుంచే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా సైంటిఫిక్ అధికారి కరుణాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఇంజనీర్స్ డే సందర్భంగా భారత్ టెక్‌లీగ్ జోనల్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిశంకరలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో అటల్ టింకరింగ్ ల్యాబ్ ఏర్పాటు చేసి పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు సైంటిఫిక్ పరికరాలు, ఆవిష్కరణలు, శాస్త్రసాంకేతికతపై అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. టెక్‌లీగ్ జోనల్ ఈవెంట్‌లో ప్రతిభ కనబరచిన వారిని ఈనెల 22న విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న నేషనల్ ఈవెంట్‌కు పంపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వేణుమాధవ్, ఇమ్మానియేల్, వంకి అనూష, రామయ్య, ప్రదీప్, కార్తీక్, లోకేష్ పాల్గొన్నారు.

## ఇంజనీర్లకు సన్మానం



ఇంజనీర్లుకు సన్మానం చేస్తున్న క్లబ్ నిర్వహకులు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 15: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ ఇంజనీర్స్ డే సందర్భంగా వెంకటగిరి రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు టీకే ప్రసాద్, ఎంపీడీవో కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్, జల వనరులశాఖ ఇంజనీర్లను సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు విజయ్, విజయలక్ష్మి, మాధవి, నరసింహులు, మల్లమ్మ పాల్గొన్నారు.

**కోట:** మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఇంజనీర్స్ డే నిర్వహించారు. భారతరత్న డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ శ్రీనివాస్, ప్రొఫెసర్ డాక్టర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదానానికి విరాళం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 15: చెంగాళమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యఅన్నదాన కార్యక్రమానికి ఆదివారం ఇద్దరు భక్తులు విరాళం అందజేశారు. గూడూరుకు చెందిన కలగట్ల పట్టాభి రామయ్య, శారద దంపతులు రూ.50,116, నగరికి చెందిన యుగేష్ రూ.20,001 అందజేశారు.

## ట్రాక్టర్ బోల్తా: ఆరుగురికి గాయాలు




గాయపడిన శివ, వెంకటరమణయ్య

చిల్లకూరు, సెప్టెంబర 15: మండలంలోని కడివేడు గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి ట్రాక్టర్ బోల్తాపడిన సంఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... గూడూరు మండలం చెన్నూరు రామలింగయ్య గిరిజనకాలనీవాసులు ఆదివారం వినాయక ప్రతిమను వాకాడు మండలం తూపిలిపాళెం గ్రామంలోని సముద్రం వద్దకు వెళ్లి నిమజ్జనం చేశారు. తిరిగి గ్రామానికి వెళుతుండగా కడివేడు వద్ద అదుపుతప్పి ట్రాక్టర్ సమీప పొలాల్లో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రవి, రవణమ్మ, ప్రమీల, శివ, వెంకటరమణయ్య, సునీతకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. రవి, శివ, వెంకటరమణయ్యను మెరుగైన వైద్యం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పోలేరమ్మ ఆలయంలో హుండీ చోరీ

డక్కిలి, సెప్టెంబరు 15: మండలంలోని తిమ్మాపాళెం గ్రామంలోని పోలేరమ్మ ఆలయంలో హుండీ చోరీకి గురైంది. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు ఆలయంలో హుండీని తీసుకెళ్తుండడాన్ని గమనించిన స్థానికులు వారిని వెంబడించారు. కొంతదూరం వెళ్లాక ఇద్దరు వ్యక్తులు హుండీని వదిలి పెట్టి పరారు కాగా, వారిలో వున్న ఓ మహిళను గ్రామస్తులు పట్టుకొన్నారు. ఆమె తమిళం మాట్లాడుతుండడంతో పోలీసులకు అప్పగించారు. అదేరోజు రాత్రి మోపూరు రోడ్డు ప్రాంతంలో గొర్రెలను ఎత్తుకెళ్లడానికి యత్నించిన దొంగలు స్థానికులు కదలికలతో పరారైనట్లు ఆ ప్రాంతవాసులు తెలిపారు. రెండు నెలల క్రితం కమ్మపల్లిలోని వినాయకుని గుడి, లింగసముద్రం రోడ్డులోని ఆంజనేయ స్వామి గుడిలో హుండీలు చోరీకి గురయ్యాయి. ఈ సంఘటనలు మరవక ముందే మళ్లీ ఆలయాల్లో హుండీల చోరీ సంఘటనలు ప్రజలను కలవర పెడుతున్నాయి.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పెళ్లకూరు, సెప్టెంబరు 15: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాల పాలైన ఘటన ఆదివారం పెళ్లకూరు మండల పరిధిలోని 71 జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. చిల్లకూరు గ్రామానికి చెందిన పూనిమాంగాడి జయచంద్ర తన టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనంపై పెళ్లకూరు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా తిరుపతి నుంచి నాయుడుపేట వైపు వెళ్తున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన జయచంద్రను నాయుడుపేట ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మట్టి తరలింపు అడ్డగింత

పెళ్లకూరు, సెప్టెంబరు 15: మండలంలోని చిల్లకూరు చెరువులో నుంచి మట్టి తరలింపును పోలీసులు అడ్డుకున్నారు. కట్ట అభివృద్ధి పనుల పేరుతో చెరువు మట్టిని బయటకు తరలిస్తుండడంతో కొందరు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారుల చెరువు మట్టిని బయటకు తరలించకుండా చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం చెరువు మట్టి తోలకాలు చేపట్టడంతో పోలీసులు అడ్డుకున్నారు.

## దాడిపై ఫిర్యాదు

పెళ్లకూరు సెప్టెంబరు 15: మండలంలోని చిల్లకూరు గ్రామానికి ఆళ్ల మణి తనపై వడ్డిపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## శివాలయంలో చోరీ

సూళ్లూరుపేట, సెప్టెంబరు 15: సూళ్లూరుపేట పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్దనున్న శివాలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. శనివారం ఉదయం స్థానికులు గుర్తించి నిర్వాహకులకు సమాచారం అందించారు. నిర్వాహకులు ఆకుతోట రమేష్ శివాలం వద్దకు చేరుకొని పరిశీలించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఇంట్లో చోరీ

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 15: పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో చోరీ జరిగింది. కాలనీలో నివాసం ఉంటున్న తిరుపాల్ ఈనెల 8వ తేదీ రాత్రి తన మిద్దెపైన ఉన్న పెంట్‌హౌస్ తలుపులు తీసివేసి నిద్రించాడు. పెంట్‌హౌస్‌లో ఉన్న 15 సవర్ల నగలు, రూ.80వేల నగదు, ఒక ల్యాప్‌టాప్ చోరీకి గురైంది. దీంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

## బైక్ చోరీ

తడ, సెప్టెంబరు 15: తడ బజారు కూడలిలో బైక్ చోరీ అయినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. సూళ్లూరుపేటకు చెందిన హజరతయ్య శనివారం తడకు వచ్చాడు. బజారు కూడలిలో బైక్ పార్క్ చేసి ఓ ఇంట్లోకి వెళ్లాడు. బయటకు వచ్చేసరికి బైక్ కనిపించకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శిలాఫలకం ధ్వంసంపై కేసు నమోదు

గూడూరు అర్బన్, సెప్టెంబరు 15: మండలంలోని చెంబడిపాళెం గ్రామంలో కొందరు శిలాఫలాకాన్ని ధ్వంసం చేశారని పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపిన మేరకు వివరాలు... మండలంలోని చెంబడిపాళెం గ్రామంలో 2018లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, మురళి, వినోద్ ధ్వంసం చేశారు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## రచ్చబండ ధ్వంసం

బాలాయపల్లి, సెప్టెంబరు 15: మండలంలోని సుబ్రమణ్యం గ్రామంలో రచ్చబండను కొందరు ధ్వంసం చేశారు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన రచ్చబండను పగులగొట్టడం ఏమిటని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ నిధులతో నిర్మించిన రచ్చబండను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 15: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన వెంకటగిరి రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. గూడూరు రైల్వే పోలీసుల కథనం మేరకు.... గుర్తుతెలియని వ్యక్తి శేషాద్రి ఎక్స్‌ప్రెస్ కింద పడి మృతి చెందాడు. అతని వయస్సు 45 ఉంటుంది. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు తెలిపారు.

# కబ్జా కోరల్లో చెరువులు

- ఆక్రమణలతో కుచించుకుపోతున్న విస్తీర్ణం
- నిల్వ సామర్థ్యం తగ్గిపోవడంతో ఆయకట్టుకు అందని సాగునీరు




చదును చేసిన మిట్టపాళెం చెరువు భూమి - చాపలపల్లి చెరువు స్థలంలో వరి సాగుచేసిన దృశ్యం

డక్కిలి, సెప్టెంబరు 15: డక్కిలి మండలంలోని పలు చెరువులు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. ఆక్రమణలతో విస్తీర్ణం కుంచించుకుపోయి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. దీంతో ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని నాగవోలు, మిట్టపాళెం, దందవోలు, దగ్గవోలు, వెలికల్లు, దేవులపల్లి, సంగనపల్లి, డక్కిలి కొత్తచెరువు, ఆలపలేరు డ్యాం పరివాహక ప్రాంతం, చాపలపల్లి, శ్రీపురం, మాటుమడుగు, పలుగోడు చెరువులు ఎక్కువగా ఆక్రమణకు గురయ్యాయి. ప్రధానంగా పలుగోడు చెరువులో సుమారు 30 ఎకరాల వరకు ఆక్రమించి వరి సాగు చేస్తున్నారు. అదేవిధంగా మిట్టపాళెం చెరువులో 25 ఎకరాల మేర ఆక్రమణకు గురికాగా, చాపలపల్లి చెరువు 20, దందవోలు చెరువు 30, దగ్గవోలు చెరువు 20, డక్కిలి పెద్ద చెరువు 20 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి. దీంతో నిల్వ సామర్థ్యం గణనీయంగా తగ్గిపోయి ఆయకట్టు చివర భూములకు నీటి కొరత ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులను పరిరక్షించాల్సిన జలవనరుల శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణలు కొనసాగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వ భూమి ఆక్రమణ

### ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



సిద్దాగుంటలో ఆక్రమణదారులు శుభ్రం చేసిన ప్రభుత్వ భూమి

బాలాయపల్లి, సెప్టెంబరు 15: మండలంలోని సిద్దాగుంట గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిద్దాగుంట గ్రామంలోని సర్వే నంబరు 113,7లో ఉన్న ప్రభుత్వ భూమిని వెంకటగిరి పట్టణానికి చెందిన కొందరు మూడు రోజుల క్రితం ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తుండగా గ్రామస్తులు కొందరు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఆక్రమణదారులను అడ్డుకోవద్దని అధికారులకు కొందరు స్థానిక అధికార పార్టీ నాయకులు హుకుం జారీ చేశారని, దీంతో రెవెన్యూ సిబ్బంది తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక అధికార పార్టీ నాయకుల అండదండలతోనే ఆక్రమణదారులకు బాలాయపల్లి మండలంలోని ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని సిద్దాగుంట గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. వీఆర్వో శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ సిద్దాగుంట రెవెన్యూ పరిధిలో గల ప్రభుత్వ భూమిని ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో అడ్డుకున్నామని చెప్పడం గమనార్హం.

## సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియం తొలగింపు




తొలగించిన పోడియం - కుర్చీ ఎత్తు తగ్గించేందుకు చదును చేస్తున్న కూలీలు

గూడూరు, సెప్టెంబరు 15: గూడూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియం తొలగింపు పనులు ఆదివారం చేపట్టారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండేలా ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంది. సబ్‌రిజిస్ట్రార్లు కూర్చునే కుర్చీ ఎత్తు తగ్గించడమే కాకుండా, వారి ముందుండే పోడియంను ఎత్తేయాలని ఆదేశాలు జారీ చేసింది. గూడూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్‌లు ఉన్నారు. ఇప్పటి వరకు వీరు కూర్చునే కుర్చీలు కొంత ఎత్తులో ఉన్నాయి. కుర్చీ చుట్టూ చెక్కలు, చెక్కలకు ఎరుపు రంగు వస్త్రాన్ని కప్పిఉండేది. రిజిస్ట్రేషన్‌కు వచ్చిన ప్రజలు వారి కంటే ఎత్తులో సబ్‌రిజిస్ట్రార్ పోడియం ముందు నిలబడి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకునేవారు. ఈ విధానం అమర్యాదగా ఉందని భావించిన ప్రభుత్వం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పోడియంలను తొలగించి, కుర్చీలను నేలకు సమాతరంగా ఉండేలా చర్యలు తీసుకుంది. దీంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియం తొలగింపు, కుర్చీ ఎత్తు తగ్గింపు వంటి పనులు చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా కొనసాగిన ఈ సంప్రదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం మార్పు చేసినందుకు ప్రజలు హర్షం వ్యక్తవ చేస్తున్నారు.

## మోక్షగుండాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి



ఇంజనీర్లను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

గూడూరు అర్బన్, సెప్టెంబరు 15: యువ ఇంజనీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ రియాజ్ అహ్మద్ అన్నారు. ఆదివారం స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయంలో ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా పలువురు పీఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖల్లో పనిచేస్తున్న ఇంజనీర్లను లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ ఇంజనీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్య క్రమశిక్షణను అలవర్చుకుని తమ నైపుణ్యాలను గ్రామాల అభివృద్ధికి వినియోగించాలన్నారు. కార్యక్రమంలో రవిచంద్ర, పీఆర్ ఈఈ రవీంద్రబాబు, సత్తార్‌హుస్సేన్, ప్రసాద్, మురళీరెడ్డి, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుడికి పూజలు



వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

గూడూరు, సెప్టెంబరు 15: వినాయక చవితిని పురస్కరించుకుని స్థానిక ఇందిరా నగర్ సమీపంలో మోదగవనం (అడవిలో వినాయకుడు) వినాయకస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ లక్ష్మీగణపతి హోమపూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూజా కార్యక్రమాలలో పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు.

## ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, సెప్టెంబరు 15: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామ సమీపంలో వెలసివున్న ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## మండలాభివృద్ధికి చేయూతనివ్వండి



మంత్రికి పుష్పగుచ్ఛంతో అందజేస్తున్న టీడీపీ నాయకులు

పెళ్లకూరు, సెప్టెంబరు 15: పెళ్లకూరు మండలాభివృద్ధికి చేయూత ఇవ్వాలని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని పెళ్లకూరు మండల టీడీపీ నేతలు కోరారు. ఆదివారం నెల్లూరులోని ఆనం నివాసంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. రెండు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన పెళ్లకూరు మండలం ఇప్పటి వరకు అభివృద్ధికి నోచుకోలేదని టీడీపీ సీనియర్ నాయకుడు పేరం రమేష్‌నాయుడు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మండల పరిస్థితులను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మరళీకృష్ణారెడ్డి మంత్రికి వివరిస్తూ ప్రత్యేక చొరవ తీసుకుని మండలాన్ని అభివృద్ధి పరచాలని విన్నవించారు. మంత్రిని కలసిన వారిలో ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శశికుమార్, నాయకులు వేలూరు కళ్యాణ్‌రెడ్డి, కందమూడి పళని, ఆరూరు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## యధేచ్ఛగా యంత్రాలతో ఉపాధి పనులు




పంటకాలువ పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్

బాలాయపల్లి, సెప్టెంబరు 15: మండలంలోని సుబ్రమణ్యం గ్రామంలో ఉపాధి హామీ పనులను యంత్రాలతో యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. గ్రామంలోని కూలీలకు పనులు కల్పించడంతో పాటు రైతులకు ఉపయోగపడేలా పంటకాలువల పూడికతీత పనులు ఉపాధి పథకం కింద చేపట్టారు. అయితే గత రెండ్రోజులుగా యాక్టివ్ మేట్ కనుసన్నల్లో కూలీలకు బదులుగా యంత్రాలతో పనులు చేపడుతుండడంతో గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉపాధి ఏపీడీ పరిశీలించి ఎక్స్‌కవేటర్‌తో చేసి పనులకు బిల్లులు చెల్లించవద్దని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. అయితే బిల్లులు ఆపేదెవరో చూద్దాం అంటూ స్థానిక నాయకులు యంత్రాలతో మూడవరోజూ పనులను కొనసాగిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

## దివ్యాంగులకు కూరగాయలు, గుడ్ల పంపిణీ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 15: స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విజయ్‌బాబు దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్, వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, రాధయ్య, మధుసూదన్, పవన్‌కుమార్, సుధీర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి తరలిన గణనాథుడు



గ్రామోత్సవంలో గణనాథుడు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 15: సూళ్లూరుపేటలో వినాయక చవితి ఉత్సవాలు తొమ్మిదో రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కచ్చేరివీధిలోని పీర్లచావడం వద్ద ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను రాత్రి నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా గణనాథుని ప్రతిమను బాణసంచా పేల్చి, మంగళవాయిద్యాలు, మేళ తాళాలు, కోలాటాలు నడుమ కోలాహలంగా గ్రామోత్సవం నిర్వహించారు. కమిటీ నిర్వాహకుడు పాండురంగయాదవ్ ఆధ్వర్యంలో పుర వీధుల్లో వైభవంగా గ్రామోత్సవంలో ఊరేగించినంతరం నిమజ్జనానికి తీసుకెళ్లారు.

## గణనాథుడి గ్రామోత్సవాలు



శ్రీలక్ష్మమ్మకాలనీ వద్ద ఊరేగుతున్న గణనాథుడు

కోట, సెప్టెంబరు 15: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం గణనాథులతో గ్రామోత్సవాలు జరిగాయి. కోట పట్టణంతో పాటు శ్రీలక్ష్మమ్మకాలనీలో వినాయక విగ్రహాలను ట్రాక్టర్లు, ఆటోల్లో ఊరేగించారు. మేళతాళాలతో యువత కేరింతలు కొడుతూ ఆయా వినాయక విగ్రహాలను మండలంలోని శ్రీనివాససత్రం సముద్రంలో నిమజ్జనం చేసేందుకు తీసుకువెళ్లారు.

## వినాయకుడి లడ్డూ వేలం

నాయుడుపేట, సెప్టెంబరు 15: వినాయక చవితిని పురస్కరించుకుని స్థానిక దర్గా సెంటర్‌లో ఏర్పాటు చేసిన 23 అడుగుల వినాయక విగ్రహానికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వినాయక చవితి లడ్డూను వేలం వేయగా రూ.2,02,116కు కూరపాటి కళ్యాణ్‌రెడ్డి దక్కించుకున్నారు. ఆయనను వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు పొట్లాపూడి రాజేష్, సాయిరాం కిషోర్, బయ్యా రమేష్, సొల్లేటి రమేష్, ఆవుల సుధా, గురుమూర్తి తదితరులు సత్కరించారు.